



'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 20.10.2025 | సంపుటి : 2 | సంచిక :256 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Monday | 20.10.2025 | volume : 2 | Issue : 256 | Pages : 8 | Cost : 2/- |


పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు
## దీపావళి శుభాకాంక్షలు



### సెలవు
దీపావళి పండుగ సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. మంగళవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.



## జనవరి 21 నుంచి జేఈఈ మెయిన్

ఏప్రిల్ 1 - 10 మధ్య రెండో విడత పరీక్షలు

2026 షెడ్యూల్‌ను ప్రకటించిన ఎన్‌టీఏ

# లొంగుబాటు విప్లవ ద్రోహమే

### అభయ్ పేరుతో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ లేఖ



హైదరాబాద్: మావోయిస్టు పార్టీలో లేఖల యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో క్యాడర్‌ను కాపాడుకునేందుకు ఆయుధాలు అప్పగించి లొంగిపోవడం మినహా మరోమార్గం లేదని కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ ఎలియాస్ సోనూ బహిరంగ లేఖ రాయడం, ఆ తర్వాత సహచరులతో కలిసి మహారాష్ట్ర సీఎం ఎదుట లొంగిపోవడం తెలిసిందే. దీనికి ప్రతిగా కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో ఆదివారం మరో లేఖ విడుదల చేసింది. సోనూ

- మిగతా 2 లో..



## కార్తిక మాసం వేడుకలకు యాదగిరీశుడి క్షేత్రం ముస్తాబు

నారసింహుడి సన్నిధిలో భక్తుల సందడి

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం కార్తిక మాసం వేడుకలకు ముస్తాబవుతోంది. బుధవారం నుంచి వేడుకల నిర్వహణకు దేవస్థానం సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాల నిర్వహణ కోసం కొండ

- మిగతా 2 లో..

## భూమిపై ఆధిపత్యానికి ప్రయత్నించిన వారిని
# ఇంటికి పంపారు




సర్వేయర్ల భుజస్కంధాలపై ప్రభుత్వ బాధ్యతలు

అన్నదాతకు అన్యాయం చేస్తే మీ కుటుంబానికి చేసినట్టే..

ప్రజలకు భూమి కన్నతల్లిలాంటిది..

మీరు తప్పులు చేస్తే ప్రజలు ప్రభుత్వంపై తిరగబడతారు

లైసెన్స్‌డ్ సర్వేయర్లతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కొత్తగా ఎంపికైన సర్వేయర్లకు లైసెన్స్ పత్రాల అందజేత

రైతుకు అన్యాయం చేస్తే సొంత కుటుంబానికి అన్యాయం చేసినట్టేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే లైసెన్స్‌డ్ సర్వేయర్లు నిజాయితీ, చిత్తశుద్ధితో పనిచేసి భూమి సమస్యలను పరిష్కరించాలని, రైతాంగానికి అండగా నిలబడాలని సూచించారు. రాష్ట్రంలో కొత్తగా నియమితులైన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఆదివారం శిల్పకళావేదికలో జరిగిన కార్యక్రమంలో ఆయన లైసెన్స్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

## 21 ఏళ్లకే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలి

ఇందుకోసం శాసనసభలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపుతాం

చార్మినార్ వద్ద రాజీవ్‌గాంధీ సద్భావన సంస్మరణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

కేంద్ర మాజీమంత్రి సల్మాన్ ఖుర్షీద్‌కు రాజీవ్‌గాంధీ సద్భావన అవార్డు ప్రదానం

హైదరాబాద్: రాజకీయాల్లో పోటీ చేసి ప్రజాసేవ చేసేందుకు యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని, 21 ఏళ్లకే పోటీ చేసే అవకాశం కల్పించే విధంగా రాజ్యాంగ సవరణ బిల్లు తీసుకురావాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి

- మిగతా 2 లో..



# కమీషన్ల కోసం మంత్రుల కొట్లాట

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కాంగ్రెస్ పనితీరుకు పరీక్ష

సొంత భూముల కోసమే ఫ్యూచర్ సిటీపై సీఎం ఖర్చు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కాంట్రాక్టులు, బిల్లులు మొదలుకొని అన్ని పనుల్లో కమీషన్ల కోసమే మంత్రులు కొట్లాడు కుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వంపై ఎన్ని ఆరోపణలు వచ్చినా సమాధానం చెప్పాల్సిన మంత్రులు, ముఖ్యమంత్రి దాట వేత్యధోరణి అవలంభిస్తున్నారని మండిపడ్డారు. ఎయిర్ పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ వే రద్దు చేసి హైదరాబాద్ అభివృద్ధిపై రేవంత్ సర్కారు నీళ్లు చల్లిందన్నారు. ఫ్యూచర్ సిటీలో ఉన్న తన సొంత భూముల కోసం సీఎం రేవంత్ ప్రజల సొమ్మును అడ్డగోలుగా ఖర్చు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్, జూబ్లీహిల్స్ నేత అంజిబాబుతోపాటు వివిధ పార్టీల నాయకులు ఆదివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

హైదరాబాద్: 'ఎలాంటి కసరత్తు చేయకుండానే రిజర్వేషన్ల పెంపు పేరిట కాంగ్రెస్ బీసీలను మోసం చేసింది. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్, బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే గల్లీలో దొంగ పోరాటాలు చేయకుండా ఢిల్లీలో తమ అధిష్టానాలపై ఒత్తిడి తెచ్చి బీసీ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించేలా చూడాలి. ఢిల్లీలో జరిగే ప్రయత్నాలకు బీఆర్ఎస్ మద్దతు ఇస్తుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ పనితీరుకు పరీక్ష. ప్రజల జీవితాలను అల్లకల్లోలం చేసిన కాంగ్రెస్‌కు జూబ్లీహిల్స్‌లో ఓటర్లు బుద్ధి చెప్పాలి'అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

**ప్రజలు బాధ పడుతున్నారు : సబిత:**

ప్రతీ సందర్భంలో ప్రజలు కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారని, దేవుడి

- మిగతా 2 లో..



## 21 నుంచి పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు: డీజీపీ

హైదరాబాద్: ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. 21న గోషామహల్‌లోని స్టేడియంలో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 191 మంది పోలీసులు అమరులయ్యారని, వీరిలో తెలంగాణకు చెందిన వారు ఐదుగురున్నారని,

- మిగతా 2 లో..



# సీఎంకు రైతుల తిప్పలు కనిపించవా?

### రేవంత్‌రెడ్డికి తిట్లపైనే ధ్యాస: హరీశ్‌రావు

సిద్దిపేట: సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతిపక్షాలను తిట్టడంపై ఉన్న సోయి రైతుల మీద లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఆయన ఆదివారం సిద్దిపేట జిల్లా మండల పరిధిలోని మాచాపూర్‌లో మొక్కజొన్న రైతులతో మాట్లాడారు. రాష్ట్రంలో 6 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని, మక్కలు మార్కెట్‌లో పెట్టుకుని రైతులు పడిగాపులు కాస్తున్నారన్నారు. ఇప్పటికే 30 శాతం వరకు రైతులు దళారులకు విక్రయించారన్నారు. ప్రభుత్వం వెంటనే

- మిగతా 2 లో..

# మావోయిస్టులతో సంబంధాలు తెంచుకోవాలి

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



హైదరాబాద్: రాజకీయ రంగస్థలంలో ప్రజాస్వామ్యం గురించి వల్లె వేస్తూ కొందరు రాజకీయ నేతలు మావోయిస్టులతో సంబంధాలు కలిగి ఉన్నారని, వారు సాయుధ వర్గాలతో సంబంధాలను తెంచుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. తెలంగాణకు చెందిన పలువురు నేతలు మావోయిస్టులతో సంప్రదింపులు చేస్తున్నారన్న వార్తల నేపథ్యంలో బండి సంజయ్ ఆదివారం 'ఎక్స్'లో ఈ మేరకు పోస్టు చేశారు. "ప్రధాని మోదీ ఆధ్వర్యంలో, అమిత్‌షా మార్గదర్శకత్వంలో కేంద్ర సంస్థలు మావోయిస్టుల నిర్మూలనకే పరిమితం కాలేదు. అవినీతి, నేరం, ఉగ్రవాద సంబంధాల నెట్వర్క్‌లను సైతం వెలికి తీస్తున్నాయి. దేశ

- మిగతా 2 లో..



# నవంబరు 3 నుంచి ఇంజినీరింగ్ కళాశాలల బంద్

### ఈ నెల 22న సర్కారుకు నోటీసు ఇవ్వాలని సమాఖ్య నిర్ణయం

హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని ఇంజినీరింగ్‌తో పాటు ఇతర వృత్తి విద్యా కళాశాలలు నవంబరు 3 నుంచి బంద్ పాటిస్తామని ప్రైవేట్ కళాశాలల సమాఖ్య తెలిపింది. ఈ నెల 22న ప్రభుత్వానికి నోటీసు అందజేస్తామని పేర్కొంది. సమాఖ్య కోర్ కమిటీ అత్యవసర సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 25వ తేదీన విద్యార్థి సంఘాలతో, 26న సర్వసభ్య సమావేశాలు నిర్వహించాలని, నవంబరు 1వ తేదీ నాటికి అన్ని పార్టీల నేతలతో కలిసి సమావేశం జరపాలని నిర్ణయించారు.




# కమీషన్ల కోసం మంత్రుల కొట్లాట

మొదటి పేజీ తరువాయి

పాలన కోల్పోయామని జూబ్లీహిల్స్ ప్రజలు బాధ పడుతున్నారని మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగిరితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో మైనారిటీ ఓటర్లు బీఆర్ఎస్‌కు మద్దతు పలుకుతున్నారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎయిర్ పోర్టు మెట్రో పనులు ప్రారంభించడంతోపాటు 111 జీవో నుంచి విముక్తి కలిగిస్తామని బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ప్రకటించారు.

### పారా అథ్లెట్ అర్చనకు కేటీఆర్ అండ

రాజన్న సిరిసిల్ల జిల్లా చంద్రంపేటకు చెందిన పారా అథ్లెట్ మిట్టపల్లి అర్చనకు కేటీఆర్ అండగా నిలిచారు. కుట్టుపని ద్వారా జీవనోపాధిపొందుతున్న అర్చనకు పారా త్రోబాల్ క్రీడలో ఈ ఏడాది డిసెంబర్ 8 నుంచి 10 వరకు శ్రీలంకలో జరిగే అంతర్జాతీయ సౌత్ ఏషియన్ చాంపియన్ షిప్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం లభించింది. అర్చన ఆదివారం కేటీఆర్‌ను కలవగా, అవసరమైన క్రీడా పరికరాలు, శిక్షణ సామగ్రిని అందజేశారు.

# మావోయిస్టులతో సంబంధాలు తెంచుకోవాలి : సంజయ్

మొదటి పేజీ తరువాయి

భద్రతకు ముప్పుగా పరిగణించే వాళ్లు ఎవరైనా సరే తప్పించుకోలేరు" అని సంజయ్ ఆ పోస్టులో పేర్కొన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదివారం ఢిల్లీలోని నార్త్‌బ్లాక్ నుంచి కర్తవ్య భవన్‌లోని నూతన కార్యాలయానికి మారారు. కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ విస్టాలో భాగంగా నిర్మించిన ఉమ్మడి కేంద్ర సచివాలయాన్ని ఆగస్టు 6న ప్రధాని మోదీ ప్రారంభించారు. ఇప్పటివరకూ నార్త్‌బ్లాక్‌లో ఉన్న కేంద్ర ఆర్థిక, హోంమంత్రిత్వ శాఖలను అందులోకి తరలించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఇప్పటికే అందులోకి మారారు. దీపావళి సందర్భంగా బండి సంజయ్ కూడా ఆ భవన్‌లో 5వ అంతస్తులోని కార్యాలయంలోకి మారారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# 21 నుంచి పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు: డీజీపీ

మొదటి పేజీ తరువాయి



వీరికి సంబంధించి పుస్తకం ప్రచురిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో భాగంగా ఓపెన్ హౌస్‌లు నిర్వహిస్తామని, విద్యార్థులు, యువకులు పోలీస్ స్టేషన్లకు వచ్చి అధికారులతో మాట్లాడే అవకాశం కల్పిస్తామన్నారు. మాదకద్రవ్యాల ముప్పు అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, పోలీసుల పనితీరుకు సంబంధించి షార్ట్‌ఫిల్మ్, ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 22 నుంచి 24 వరకు పోలీసు అమరవీరుల కుటుంబాలను కలవడం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం, 25 నుంచి 27 వరకు సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమాల్లో అందరూ పాల్గొని.. పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించాలని డీజీపీ కోరారు.



# లొంగుబాటు విప్లవ ద్రోహమే

మొదటి పేజీ తరువాయి

లొంగుబాటు విప్లవద్రోహం, పార్టీ విచ్ఛిన్నకర చర్యగా భావిస్తున్నామని అందులో పేర్కొన్నారు. 'సోనూ, దండకారణ్యం ప్రత్యేక జోనల్ కమిటీ, ఉత్తర సబ్‌జోనల్ ఇన్‌ఛార్జి సతీశ్ లాంటి వారు ఎంతమంది ప్రత్యర్థులకు లొంగిపోయినా మావోయిస్టు పార్టీ మాత్రం లొంగిపోదు. వర్గాలు, వర్గపోరాటాలు ఉన్నంతకాలం ప్రజాయుద్ధం కొనసాగుతూనే ఉంటుంది. తాత్కాలికంగా ఎదురుదెబ్బలు తగులుతున్నా ధైర్యసాహసాలతో ముందుకు సాగుతాం. 2011 నుంచి దండకారణ్యంలో గడ్డు పరిస్థితి ఎదుర్కొంటూ వచ్చిన విప్లవోద్యమం 2018 నాటికి తాత్కాలిక వెనుకంజకు గురైంది. అప్పటి నుంచి సోనూలో రాజకీయ బలహీనత బయటపడుతూ వచ్చింది. 2020లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో విప్లవ ఆచరణలో కొన్ని లోపాలపై స్వీయ విశ్లేషణలతో కూడిన ఒక పత్రాన్ని ఆయన ప్రవేశపెట్టారు. దీన్ని కేంద్ర కమిటీ తిరస్కరించింది. ఆ తర్వాత జరిగిన సమావేశాల్లోనూ సోనూలోని తప్పుడు రాజకీయభావాలను సరిదిద్దడానికి పార్టీ కృషి చేసింది. ఈ ఏడాది మే నెలలో పార్టీ ప్రధాన కార్యదర్శి బసవరాజు మరణించిన తర్వాత సోనూలో దీర్ఘకాలంగా పేరుకుపోయిన సైద్ధాంతిక, రాజకీయ బలహీనతలు ప్రత్యర్థి ముందు మోకరిల్లేలా చేశాయి. మావోయిస్టు పార్టీ అనుసరిస్తున్న సైనిక పంథా ఓటమిపాలయ్యే పరిస్థితి ఉంది కాబట్టి ఆయుధాలను అప్పగించి లొంగిపోవడం మినహా మరో మార్గంలేదని పత్రికా ప్రకటన చేయడం సోనూ ప్రాణభీతికి నిదర్శనం. ఇలాంటి లొంగుబాట్ల వల్ల విప్లవోద్యమం శాశ్వత ఓటమికి గురికాదు. ఓడిపోయినా పీడితవర్గాలకు ప్రేరణగా నిలిచిన ఉద్యమాలు ఎన్నో ఉన్నాయి. ప్రజలే తిరిగి ఉద్యమిస్తారనడానికి ఇటీవలి నేపాల్ ఉదంతమే నిదర్శనం. మారుతున్న విప్లవయుద్ధ స్వాభావిక లక్షణాలకు తగ్గట్టుగా పార్టీ రాజకీయ సైనిక పంథాను మరింత సుసంపన్నం చేసుకుని విప్లవోద్యమాన్ని కొనసాగిద్దామని దేశప్రజానీకానికి పిలుపునిస్తున్నాం' అని లేఖలో అభయ్ పేర్కొన్నారు.

# ధరణి దరిద్రంతోనే భూ దోపిడీ

మొదటి పేజీ తరువాయి



హైదరాబాద్: రాజ్యాల మధ్య యుద్ధాలు జరిగినా, జల్ జంగిల్ జమీన్ నినాదంతో కొమురం భీమ్ పోరాడినా, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భాగంగా నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో ఎర్ర జెండా ఎగిరినా భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసమే జరిగాయి. కన్నతల్లిపై ఎంత మమకారం ఉంటుందో, తెలంగాణలో భూమిపై కూడా అదే అనుబంధాన్ని చూపిస్తారు. భూమిపై ఆధిపత్యం చెలాయించాలని చూసినప్పుడు దళితులు, గిరిజనులు, ఆదివాసీలైనా, నిరుపేద నిరక్షరాస్యులైనా నిటారుగా నిలబడి కొట్లాడిన చరిత్ర తెలంగాణ గడ్డకు ఉంది. విసునూరు దొరలు చెరబట్టాలనుకున్న ఎకరం భూమి కోసం వీరనారిగా మారిన చాకలి ఐలమ్మ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చారు. భూ యజమానుల హక్కులు, ఆ భూముల సరిహద్దులను నిర్ణయించే అధికారం సర్వేయర్ల చేతుల్లో ప్రభుత్వం పెట్టబోతోంది. ఈ క్రమంలో తప్పులకు తావిస్తే ప్రజలు సర్వేయర్లతోపాటు ప్రభుత్వంపై కూడా తిరగబడే అవకాశం ఉంది'అని తెలిపారు.

### బంగాళాఖాతంలో విసిరేశారు

గత ప్రభుత్వ హయాంలో ధరణి అనే చట్టం కొద్ది మంది దొరలకు చుట్టంగా మారిందని సీఎం రేవంత్ ఆరోపించారు. 'ఈ ధరణి దరిద్రంతోనే ఒక ఎమ్మార్వోను పెట్రోల్ పోసి తగలబెట్టే పరిస్థితులు వచ్చాయి. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో జంట హత్యలకు కారణమైంది కూడా ఈ చట్టమే. ధరణి చట్టాన్ని అడ్డుపెట్టుకుని భూమి మీద ఆధిపత్యం చెలాయించాలనుకున్న దొరలకు ప్రజలు గత ఎన్నికల్లో గుణపాఠం చెప్పి బంగాళాఖాతంలో విసిరేశారు. ఆ భూ దోపిడీ నుంచి విముక్తి కోసమే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారు. మేం అధికారంలోకి వచ్చాక భూ సమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం తీసుకొచ్చాం. ఇప్పుడు 1.60 కోట్ల ఎకరాల వ్యవసాయ యోగ్య భూమి తెలంగాణ రైతాంగం దగ్గర ఉంది. భూ సమస్యలను పరిష్కరించేందుకు, రైతుకు అండగా ఉండేందుకే లైసెన్స్డ్ సర్వేయర్ల వ్యవస్థను తీసుకొచ్చాం'అని సీఎం తెలిపారు. త్వరలోనే గ్రూప్-3, 4 ఉద్యోగాలు భర్తీ చేస్తామని, 11 వేల మందికి నియామక పత్రాలు అందించబోతున్నామని వెల్లడించారు.

### మా సైన్యం మీరే..

తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చెందిన, ఆదర్శ రాష్ట్రంగా దేశంలో మొదటి స్థానంలో నిలబట్టేందుకు తమ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్‌ను తీసుకొస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి ఎలా ఉండాలో అందరూ సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. తమ ప్రభుత్వం ఏ చట్టం చేసినా ప్రజలను భాగస్వాములను చేస్తుందని, సమస్యలను తెలిసిన వారిని పరిష్కారం అడగడం ద్వారా నిజమైన అభివృద్ధికి బాటలు వేస్తుందని చెప్పారు. 'తెలంగాణ రాష్ట్రాన్ని 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. ఆ లక్ష్యం నెరవేరడంలో మీ సహకారం కావాలి. రైతుల సమస్యలు పరిష్కారం కావాలి. వ్యవసాయం దండుగ కాదు పండుగ చేయాలి. రైతు రాజు కావాలంటే మీరు కష్టపడి పనిచేయాలి. మీ శ్రమకు ఫీజు తీసుకోండి. కానీ రైతులకు అన్యాయం చేయొద్దు. క్షలాది మంది రైతుల సమస్యలను పరిష్కరించే బాధ్యతలను తీసుకుని మీరు వెళుతున్నారు. మాకెవరూ ప్రతినిధులు లేరు. మాకు సైన్యం లేదు. మీరే మా ప్రతినిధులు, మా సైనికులు మీరే. ప్రభుత్వ ఆలోచనలు, బాధ్యతలను మీ భుజస్కందాలపై పెట్టి పంపుతున్నాం. తెలంగాణ పునర్నిర్మాణం చేసేది మీరే'అని సర్వేయర్లకు సీఎం రేవంత్ తెలిపారు. కార్యక్రమంలో కొత్త లైసెన్స్డ్ సర్వేయర్లతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. ధరణిని బంగాళాఖాతంలో వేసి, ప్రజలు మెచ్చే భూభారతి చట్టం తీసుకొచ్చామని తెలిపారు. తెలంగాణ రైతాంగానికి లైసెన్స్డ్ సర్వేయర్ల రూపంలో ప్రభుత్వం దీపావళి కానుక అందించిందని చెప్పారు. 3,456 మందికి సర్వే లైసెన్స్‌లు మంజూరు చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మందుల సామేల్, టి. రామ్మోహన్‌రెడ్డి, కె.ఆర్. నాగరాజు, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, టీజీఐఐసీ చైర్మన్ టి.నిర్మలా జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు దీపావళి కానుక : పొంగులేటి

రెవెన్యూ వ్యవస్థకు లైసెన్స్డ్ సర్వేయర్లు మంచిపేరు తీసుకురావాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. చిన్న తప్పులకు కూడా ఆస్కారం లేకుండా, ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా పనిచేయాలన్నారు. "దశాబ్దాల తరబడి తీవ్ర అసంతృప్తితో ఉన్న రైతులకు... లైసెన్స్డ్ సర్వేయర్ల నియామకం రూపంలో రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుక అందించింది. గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను కుప్పకూల్చింది. ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని ఆనాడే చెప్పాం. అదేవిధంగా చేసి... ప్రజలకు నచ్చేలా కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకొచ్చాం. భూ భారతి చట్టంతోపాటు గ్రామ పాలన అధికారులను నియమించి గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేశాం. గత పదేళ్లలో సుమారు 630 మంది సర్వేయర్ల అవసరమున్నా ఆనాటి ప్రభుత్వం నియమించలేదు. నాటి ప్రభుత్వ తప్పిదాన్ని సరిచేస్తున్నాం. క్షుణ్ణంగా అధ్యయనం చేసి సర్వేయర్ల వ్యవస్థను తీసుకొస్తున్నాం. లైసెన్స్డ్ సర్వేయర్లకు పది వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. జేఎన్‌టీయూ ద్వారా ఏడు వేల మందికి పరీక్షలు నిర్వహించాం. ఇందులో 3,456 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈబీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు వయోపరిమితిలో సడలింపు ఇచ్చాం. రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 9.80 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నాం. భూమి ఉన్న ప్రతి రైతుకూ భరోసా, భద్రత ఇచ్చేలా లైసెన్స్డ్ సర్వేయర్ల వ్యవస్థను ఏర్పాటు చేశాం. నిరుద్యోగ యువతను ప్రోత్సహించేందుకు సర్వేయర్ల స్థానంలో అవకాశం కల్పించాం" అని పొంగులేటి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన లైసెన్స్డ్ సర్వేయర్లతో మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, మందుల సామేలు, రామ్మోహన్‌రెడ్డి, నాగరాజు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సర్వేశాఖ డైరెక్టర్ ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం జరుగుతుండగా పలువురు లైసెన్స్డ్ సర్వేయర్లు తమకు జీతాలు అందించాలని, న్యాయం చేయాలని పలుమార్లు నినాదాలు చేశారు.

# యాదవులకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పిస్తాం

- సదర్ సరదాలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్
- సదర్‌ను రాష్ట్ర పండుగగా గుర్తించి నిధులు ఇస్తున్నాం: సీఎం రేవంత్‌రెడ్డి
- ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో అట్టహాసంగా సదర్ వేడుకలు



**హైదరాబాద్ :** యాదవులకు రాజకీయ రంగంలో సముచిత స్థానం కల్పిస్తామని.. హైదరాబాద్ కా సదర్ ..యాదవుల ఖదర్ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కులీకుతుబ్‌షాల కాలం నుంచి యాదవులపై నమ్మకం, విశ్వాసం ఉందని, యాదవులకు నమ్మిన వారికోసం ఏదైనా చేసే తెగువ ఉందని చెప్పారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో శ్రీ కృష్ణ సదర్ సమ్మేళనం ఆధ్వర్యంలో సదర్ వేడుకలను ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించా రు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తదితరులు హాజరయ్యారు. ముందుగా, శ్రీకృష్ణ భగవానుడికి, దున్నపో తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ యాదవులు ఎదుర్కొంటున్న సమస్యలను యాదవ ప్రతినిధులు ఎప్పుడైనా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే ఆ సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తాన న్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో యాదవుల పాత్ర అత్యంత కీలకమైందని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సదర్‌ను రాష్ట్ర పండుగగా గుర్తించి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత యాదవులకు సముచిత స్థానం లభించిందన్నారు. సదర్ సందర్భంగా ఏర్పాటు చేసిన డప్పుడోలు.. కోలాటం.. బోనాలు, కళారూపాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జంటనగరాల నుంచి యాదవులు వారి దున్నపోతులను అందంగా అలంకరించి వాటితో చేయించిన విన్యాసాలు అలరించాయి. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగా పాత పెద్దమ్మతల్లి దేవాలయ కమిటీ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.



# 21 ఏళ్లకే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలి

మొదటి పేజీ తరువాయి

రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందుకోసం రాబోయేరోజుల్లో తాము శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం తెలిపి కేంద్రానికి పంపుతామని చెప్పారు. ఆదివారం చార్మినార్ వద్ద రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర సంస్మరణ దినోత్సవ సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి..కేంద్ర మాజీమంత్రి సల్మాన్ ఖుర్షీద్‌కు రాజీవ్‌గాంధీ సద్భావన అవార్డును టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని, ఓటుహక్కు వయసు పరిమితిని 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం 21 ఏళ్లకే యువత ఐఏఎస్, ఐపీఎస్ హోదాల్లో ప్రజాసేవ చేస్తుండగా, రాజకీయాల్లో మాత్రం ప్రజాప్రతినిధులుగా కొనసాగడానికి అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జూడోయాత్ర చేపట్టి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని, అన్నివర్గాల ప్రజల సంక్షేమాన్ని నిరంతరం కొనసాగిస్తామని అప్పుడు ఇచ్చిన హామీ మేరకు.. ప్రస్తుతం కుల మతాలకతీతంగా సంక్షేమ పథకాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం పంపిణీ కేవలం మన రాష్ట్రంలోనే అమలు జరుగుతోందని మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, జి.చిన్నారెడ్డి, మదన్‌మోహన్, బల్మూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



# కార్తిక మాసం వేడుకలకు యాదగిరీశుడి క్షేత్రం ముస్తాబు

మొదటి పేజీ తరువాయి

కింద ఆధ్యాత్మికవాడలోని వ్రత మండపంలోని రెండు హాళ్లను సిద్ధం చేశారు. బుధవారం నుంచి మొదలై, నవంబరు 21 వరకు కొనసాగే కార్తిక మాసంలో శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలను సామూహికంగా రోజూ ఆరు దఫాలుగా, కార్తిక పౌర్ణమి రోజు ఎనిమిది విడతలుగా నిర్వహిస్తారు. సోమవారం దీపావళి పండగ సందర్భంగా ఉదయం 3.30గం.లకు స్వామి వారి సుప్రభాతం, 4.45 గం.లకు ఆస్థాన మంగళ హారతులు, 5.45గం.లకు తిరువారాధన, బాలభోగం, ఆరగింపు, 6.45గం. లకు సహస్ర నామార్చన నిర్వహించనున్నారు. 7.15గం.లకు సర్వ దర్శనం ప్రారంభమవుతుంది.

# సీఎంకు రైతుల తిప్పలు కనిపించవా?

మొదటి పేజీ తరువాయి



మొక్క జొన్న, పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

**సాగు ఎట్లుందమ్మా:** వ్యవసాయం ఎట్లుందమ్మా.. ఇబ్బందులు వస్తున్నా యా అంటూ హరీశ్‌రావు రైతులను ఆప్యాయంగా పలకరించారు. ఏమున్నది సారూ అన్నింటికీ ఇబ్బంది అవుతోందంటూ రైతులు బదులిచ్చారు. చిన్నకోడూరు మండల పరిధిలోని గంగాపూర్‌లో పొలాల వద్ద సద్ది తింటున్న రైతులతో హరీశ్‌రావు ముచ్చటించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 'యూరియా కోసం రోజుల తర బడి పడిగాపులు కాసినా ఒక్క బస్తా దొరక లేదు. వ్యవసాయానికి సరిపడా కరెంట్ ఇవ్వడం లేదు. సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేయలేదు. సన్న బియ్యంతో అన్నం ముద్ద అవుతోంది. మూడు పంటలు పండిస్తున్నామంటే మీరు తెచ్చిన కాళేశ్వరం నీళ్లే ఆసరా' అని రైతులు చెప్పారు. రేవంత్ పాలన రైతులను నట్టేట ముంచిందని, రైతుల ఉసురు తప్పక తగులుతుందని హరీశ్ పేర్కొన్నారు.




# బీఆర్ఎస్ తరపున నామినేషన్ వేసిన విష్ణు

**హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు బీఆర్ఎస్ తరపున ఆ పార్టీ నేత, పీజేఆర్ తనయుడు పి.విష్ణువర్ధన్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఆయనే స్వయంగా రిటర్నింగ్ అధికారికి రెండుసెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బీఆర్ఎస్ విష్ణుతో నామినేషన్ వేయించింది. ఇప్పటికే బీఆర్ఎస్ తరపున మాగంటి గోపీనాథ్ భార్య మాగంటి సునీత మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అయితే, సునీత నామినేషన్‌ను ఎన్నికల అధికారులు ఆమోదం తెలిపిన తర్వాత విష్ణువర్ధన్‌రెడ్డి నామినేషన్ ఉపసంహరించుకుంటారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 21న కూడా మాగంటి సునీత మరోసారి భారీ ర్యాలీతో వచ్చి నామినేషన్ దాఖలు చేస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నామినేషన్ల స్క్రూటినీలో ఏదైనా తేడా వస్తే విష్ణు బరిలో ఉంటారని తెలుస్తోంది.

## 10 లక్షలు ఇస్తా రాజీ చేయండి...

# ఉపాధ్యాయుడి బేరసారాలు

- పాఠశాల విద్యార్థినీలపై ఉపాధ్యాయుడు లైంగిక వేదింపులు..
- ప్రాథమికోన్నత పాఠశాలలో ఆలస్యంగా వెలుగులోకి
- విచారణను తప్పుదోవ పట్టించేందుకు ప్రణాళిక



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** విద్యార్థుల చేత పెన్ను, పుస్తకం చేతబట్టించి విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు కామాంధుడుగా మారాడు. పాఠశాలకి వచ్చిన విద్యార్థినిలను తల్లితండ్రుల వలే కంటికి రెప్పలా కాపాడుతూ అక్షరాలు నేర్పించాల్సింది పోయి వెకిలి చేష్టలతో వంకర బుద్ధుని ప్రదర్శించాడు. కూసుమంచి మండలంలోని ఓ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాలకు వచ్చే అభం శుభం తెలియని విద్యార్థినిలతో సదరు ఉపాధ్యాయుడు తాకరాని చోట అసభ్యకరంగా తాకుతూ, వెకిలి చేష్టలు చేస్తూ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. ఉపాధ్యాయుడు వికృత చేష్టలను అర్థం చేసుకోలేని అమాయకత్వంతో విద్యార్థినిలు మిన్నకుండిపోయారు. కాగా ఓ విద్యార్థిని ధైర్యం చేసి ఉపాధ్యాయుడు విద్యార్థినిల పట్ల వ్యవహరిస్తున్న ఘోరాన్ని కళ్లకు కట్టినట్లుగా తల్లితండ్రులకు వివరించింది. దీంతో విద్యార్థిని తండ్రి పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులని నిలదీశారు. తోటి విద్యార్థినులు సైతం ఉపాధ్యాయుడు అరాచకా లను బహిరంగంగా పూస గుచ్చినట్టు వివరించారు. తల్లితండ్రులు ఆగ్రహం వ్యక్తం చేయగా ఉపాధ్యాయులు కాళ్ల వెళ్లా పడి విషయాన్ని గోప్యంగా ఉంచారు. ఈ నేపథ్యంలో అప్పటికప్పుడు స్టాఫ్ మీటింగ్ ఏర్పాటు ప్రధానోపాధ్యాయుడు విషయాన్ని బయటకి పొక్కకుండా గుట్టుగా ఉంచే ప్రయత్నం చేశారు.

### వర్క్ అడ్జెస్ట్ మెంట్లో ఖమ్మం నగరానికి బదిలీ..

విద్యార్థినిల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడు ఇటీవల జరిగిన వర్క్ అడ్జెస్ట్ మెంట్ లో భాగంగా ఖమ్మం నగరంలోని ఓ ప్రభుత్వ పాఠశాలకి బధిలి పై వెళ్లాడు. అంగ బలం, అర్థ బలంతో పాటుగా సామాజిక వర్గం అండదండలు తొడవ్వడంతో పైరవీల ద్వారా గుట్టుచప్పుడు కాకుండా ఈ బదిలీని చేయించుకున్నాడు.

### జైలు జీవితం గడిపిన మారని బుద్ధి..

పాఠశాల విద్యార్థినీలను లైంగికంగా వేధించిన ఉపాధ్యాయుడు గతంలో ఖమ్మం రూరల్ మండలంలోని ఓ పాఠశాలలో పనిచేసే సమయంలో ఇదే విధంగా ప్రవర్తించి కేసుల పాలై, సస్పెన్షన్ కి గురై జైలు జీవితం కూడా గడిపాడు. సస్పెన్షన్ అనంతరం తిరిగి విధుల్లో చేరినప్పటికి ఉపాధ్యాయుడి వంకర బుద్ధి మాత్రం మారలేదు.

### పది లక్షలు ఇస్తా రాజీ కుదర్చండి..

అన్నెం పున్నెం ఎరుగని పాఠశాల విద్యార్థినీలను లైంగికంగా వేధించిన విషయం బట్టబయలు కావడంతో ఈ కేసు నుండి బయట పడేందుకు, సస్పెన్షన్ వేటు పడకుండా కాపాడితే పది లక్షలు ఇస్తా.. రాజీ కుదర్చండి అంటూ ఉపాధ్యాయుడు బేరసారాలు చేయడం గమనార్హం. ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్ లో ఉన్న ఓ రెస్టారెంట్ లో ఓ ప్రధాన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు,ఓ అధికారి భేటీ అయి ఈ సంఘటన నుండి ఉపాధ్యాయుడుని ఎలా బయట పడేయాలో తలమునకలై ఉన్నారు. విచారణ సమయంలో ఉపాధ్యాయుడుకి అనుకూలంగా, తప్పుదోవ పట్టించే రిపోర్ట్ ఇచ్చేలా దాదాపుగా అన్ని రకాల ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు.

### డిఈఓనే విచారణ చేయాలి.

కామ కోర్కెలతో విద్యార్థినిలను వేధించిన ఉపాధ్యాయుడు వ్యవహారం పై జిల్లా విద్యాధికారిణి స్వయంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకొని, విద్యార్థినిలకి న్యాయం చేయాలని తల్లితండ్రులు వేడుకుంటున్నారు

## పాక్- అఫ్గాన్ మధ్య కుదిరిన

# కాల్పుల విరమణ ఒప్పందం



**ఖతార్ :** పాకిస్థాన్– అఫ్గానిస్థాన్ మధ్య జరిగిన శాంతి చర్చలు ఫలించాయి. దోహా వేదికగా తక్షణ కాల్పుల విరమణకు ఇరుదేశాలు అంగీకరించాయి. ఖతార్ విదేశాంగ మంత్రిత్వశాఖ స్వయంగా ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఖతార్, తుర్కియే మధ్యవర్తిత్వంతో పాక్–అఫ్గాన్‌ల మధ్య కాల్పుల విరమణకు సంబంధించిన చర్చలు జరిగాయి. ఈ క్రమంలో జరిగిన చర్చలు ఫలించాయని ఖతార్ పేర్కొంది. రెండు దఫాలుగా జరిగిన ఈ చర్చల్లో శాశ్వత శాంతి, స్థిరత్వం కోసం ఇరుదేశాలు తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయని తెలిపింది. ఈ ఒప్పందానికి సంబంధించిన స్థిరత్వాన్ని కొనసాగించడంపై రానున్న రోజుల్లో మరిన్ని చర్చలు జరిపేందుకు కూడా వారు అంగీకరించారని వెల్లడించింది. ఈ చర్చల్లో ఇరుదేశాలకు చెందిన రక్షణ మంత్రులు పాల్గొన్నారు. ఈ క్రమంలో పక్క దేశం నుంచి వస్తున్న దురాక్రమణలకు మాత్రమే ప్రతిస్పందిస్తున్నామన్నట్లుగా ఇరువర్గాలు వాదనలు చేసుకున్నట్లు తెలుస్తోంది. అఫ్గాన్ నుంచి వస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని అంతం చేయడంతో పాటు సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం పునరుద్ధరణ చర్యలపై మాత్రమే దృష్టి పెట్టామని పాక్ పేర్కొంది. సరిహద్దుల్లో దాడులకు పాల్పడే ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నారనే ఆరోపణలను అఫ్గాన్ ఖండించింది. శుక్రవారం అర్ధరాత్రి అఫ్గాన్‌లోని పాక్టికా ప్రావిన్స్‌పై పాక్ వైమానిక దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని పాక్ భద్రతాధికారులు కూడా ధ్రువీకరించారు. అయితే, తాము చేసిన ఈ దాడుల్లో డజన్ల మంది సాయుధ దళాల సిబ్బంది మరణించారని, పౌరులెవరూ ప్రాణాలు కోల్పోలేదని పేర్కొన్నారు. పాక్ చేసిన దాడుల్లో యువ క్రికెటర్లు, మహిళలు, చిన్నారులతో సహా కనీసం 10 మంది మృతి చెందారని అఫ్గాన్ అధికారులు తెలిపారు.

## జేఈఈ మెయిన్-2026

# పరీక్షల షెడ్యూల్ విడుదల



జేఈఈ మెయిన్ పరీక్షకు సన్నద్ధమవుతోన్న లక్షలాది మంది విద్యార్థులకు ఎన్‌టీఏ కీలక అప్‌డేట్ ఇచ్చింది. రెండు సెషన్లలో నిర్వహించే ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్షకు సంబంధించి ఆదివారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. జనవరి 21 నుంచి 30 మధ్య తేదీల్లో జేఈఈ మెయిన్ (సెషన్ 1), ఏప్రిల్ 1 నుంచి 10వ తేదీల మధ్య సెషన్ –2 పరీక్షలు నిర్వహించనున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. అయితే, ఈ పరీక్షలు జరిగే కచ్చితమైన తేదీలను తర్వాత ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. జేఈఈ మెయిన్ సెషన్ –1 పరీక్షకు ఈ నెల నుంచే ఆన్‌లైన్ దరఖాస్తులు వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వస్తాయని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పేర్కొంది. సెషన్–2 పరీక్షకు జనవరి ఆఖరి వారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. దేశ వ్యాప్తంగా జరిగే ఈ పరీక్షకు భారీ సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యేలా ఎగ్జామ్ సిటీల సంఖ్యను పెంచేందుకు కృషిచేస్తున్నామని.. దివ్యాంగ అభ్యర్థుల అవసరాలను తీర్చడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు పేర్కొంది.

### ఈ డాక్యుమెంట్స్ అప్‌డేట్‌గా ఉన్నాయా?

జేఈఈ (మెయిన్) 2026 పరీక్షను సజావుగా నిర్వహించడంలో భాగంగా అర్హత కలిగిన అభ్యర్థులంతా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకొనే ముందే అవసరమైన డాక్యుమెంట్‌లను అప్‌డేట్ చేసుకోవాలని ఎన్‌టీఏ ఇటీవల కోరిన విషయం తెలిసిందే. తద్వారా దరఖాస్తుల ప్రక్రియ, తదుపరి దశల్లో ఎదురయ్యే ఇబ్బందులు తప్పుతాయని, దరఖాస్తుల తిరస్కరణ, తదితర సమస్యలు తలెత్తకుండా ఉంటాయని పేర్కొంది.

ఆధార్: ఆధార్ కార్డులో పేరు, పుట్టిన తేదీ (పదో తరగతి సర్టిఫికెట్ ప్రకారం) సరిగా ఉండేలా అప్‌డేట్ చేసుకోండి. అలాగే, తాజా ఫొటోగ్రాఫ్, ఇంటి అడ్రస్, తండ్రి పేరు మీ కార్డులో అప్‌డేట్ అయి ఉండాలి.

**దివ్యాంగ అభ్యర్థులైతే..:** యూడీఐడీ కార్డు చెల్లుబాటవుతుంది. అయితే, రెన్యువల్ చేయించుకొని అప్‌డేట్‌గా ఉండటం తప్పనిసరి.

**కేటగిరీ సర్టిఫికెట్:** కేటగిరీ సర్టిఫికెట్ (ఈడబ్ల్యూఎస్/ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ–ఎన్‌సీఎల్)ను చెల్లుబాటయ్యేలా అప్డేట్ చేసుకోండి. అలాగే, అభ్యర్థులు ఎప్పటికప్పుడు www.nta.ac.in, https://jeemain.nta.nic.in అధికారిక వెబ్‌సైట్‌లను చెక్ చేసుకోవాలని ఎన్‌టీఏ డైరెక్టర్ (పరీక్షలు) ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తద్వారా జేఈఈ మెయిన్ పరీక్షకు సంబంధించిన నోటీసులు, ఇతర అప్‌డేట్స్ తెలుసుకోవచ్చున్నారు.

# మహారాష్ట్రలో 96 లక్షల మంది నకిలీ ఓటర్లు : రాజ్ ఠాక్రే



**మహారాష్ట్ర :** మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో 96 లక్షల మంది నకిలీ ఓటర్లు చేరారని ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ ఠాక్రే ఆరోపించారు. ఓటర్ల జాబితాను సరిచేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలను ఎలా నిర్వహిస్తారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. పార్టీ బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశంలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. అవకతవకలతో కూడిన ఓటర్ల జాబితాతో ఎన్నికలు నిర్వహిస్తే.. అది ఓటర్లకు అవమానకరమని పేర్కొన్నారు. నకిలీలను గుర్తించేందుకు ఓటర్ లిస్ట్‌లను పరిశీలించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. "ప్రాంతీయ పార్టీలను అంతం చేసే కుట్ర జరుగుతోంది. రానున్న ఎన్నికల కోసం రాష్ట్ర ఓటర్ల జాబితాలో 96 లక్షల మంది నకిలీ ఓటర్లు చేరారని తెలిసింది. ముంబయిలో 8–10 లక్షల మంది, ఠాణె, పుణె, నాసిక్‌లలో 8–8.5 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా ఇదే జరిగింది. ఇలాగే ఎన్నికలు నిర్వహిస్తే.. అది ఓటర్లను, దేశాన్ని అవమానించ చడమే అవుతుంది" అని రాజ్ ఠాక్రే వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘాన్ని విమర్శిస్తే అధికార పార్టీలు కలత చెందుతున్నాయని, ఇది వారిని బాధపెడుతోందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలంటే.. తొలుత ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయాలని రాజ్ ఠాక్రే డిమాండ్ చేశారు. నకిలీ ఓటర్లను చేర్చడం ద్వారా ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటోందని నేరుగా భాజపా పేరు ప్రస్తావించకుండా ఆరోపించారు. ఓటేసినా.. వేయకపోయినా.. మ్యాచ్ ఫిక్సింగ్ జరుగుతోందని, ఇది ఎటువంటి ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఎన్ఎస్‌కు దారుణ ఫలితాలు రావడంపై స్పందిస్తూ.. ఓటింగ్ ప్రక్రియే రాజీపడితే తమకు ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎలా ఉంటారన్నారు. ఆ ఎన్నికల్లో అధికార పార్టీ ఎలా గెలిచిందో అందరికీ తెలుసన్నారు. మహారాష్ట్రలో గతేడాది జరిగిన శాసనసభ ఎన్నికల్లో అక్రమాలు చోటుచేసుకొన్నట్లు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పలుమార్లు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. 2019–24 మధ్య మహారాష్ట్రలో 31 లక్షల మంది ఓటర్లు పెరిగితే.. ఆ తర్వాత ఐదు నెలల్లోనే 41 లక్షలమంది పెరిగారన్నారు. ఇటీవల కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ), ఎంఎన్ఎస్ తదితర ప్రతిపక్ష పార్టీల నేతలు రాష్ట్ర ఎన్నికల అధికారులను కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాను సరిదిద్దాలని డిమాండ్ చేశారు.

# హెూటల్‌కి ప్రతి రోజు తొలి అతిథిగా కాకి

- కాకి తిన్నకే వినియోగదారులకు అల్పాహారం
- యజమానితో అనుబంధం..
- వింతగా గమనిస్తున్న వినియోగదారులు
- నేలకొండపల్లి బాబాయ్ హెూటల్‌లో ఘటన



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ఆ హెూటల్ కి తొలిఅతిథి కాకే... హెూటల్ తెరవగానే ఆ అతిధి చక్కగా ఆశినులై ఉంటుంది. కడాయి నుంచి వేడివేడిగా వేయించిన రవ్వ బోండా కోసం అవుట్లో అప్పుడే ఉడికిన ఇడ్లీ ముందుగా తనకు పెడతారని తెలుసు కాబోలు...నిత్యం హెూటల్ తెరవక ముందే అక్కడ వేచి చూస్తుంది. హెూటల్ యజమాని సహితం ఆ అతిధి కి తన తొలి అల్పాహారం వంటకాలను రుచి చూపించాకే దుకాణం ప్రారంభిస్తాడు. ప్రతి రోజు జరిగే ఓ ఆసక్తికర సన్నివేశం... నేలకొండపల్లి మండల కేంద్రంలోని బాబాయ్ హెూటల్ గా పేరుగాంచిన నరేష్, చాముండేశ్వరి దంపతులు స్థానిక ప్రభుత్వాసుపత్రి ఎదుట గత పదేళ్లుగా హెూటల్ నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు వారు హెూటల్ ప్రారంభించే సమయానికి వేకువజామునే ఓ కాకి రావడాన్ని యజమాని నరేష్ గమనించాడు. కాకి గోడపై కూర్చొని తదేకంగా ఆహార పదార్థాలను చూస్తూ అరవటాన్ని ఆయన గమనించాడు. తొలిసారిగా వేయించిన నూనె వస్తువులు ఇతర అల్పాహారాలు తీసి గోడపై పెట్టగా కాకి రోజు తినేది అలా ప్రతిరోజు కాకి ఉదయాన్నే హెూటల్ కు రావడం, తనకోసం ఆహార పదార్థాలను అల్పాహారాలను ఆరగించి వెళ్లడం తన దినచర్యలో భాగంగా చేసుకుంది. ఇదే అలుసుగా కాకి అప్పుడప్పుడు తన అభిరుచులను కోరేది.కొన్నిసార్లు ఇడ్లీ తినకపోవడాన్ని యజమాని నరేష్ గమనించాడు. దీంతో అల్పాహారాలను మార్చి మార్చి కాకికి పెడుతుండేవాడు. ఓ రోజు పూరి కావాలని మరో రోజు ఇడ్లీ మాత్రమే కావాలని ఇంకో రోజు వడ మాత్రమే పెట్టాలని హుకుం చేస్తుండేది. తనకు కావాల్సిన పదార్థం అందించకపోతే అరిచి గోల చేస్తుంటుండం గమనించదగ్గ విషయం. ఇలా కాకి యజమానితో బంధాన్ని ఏర్పరచుకుంది.అక్కడకు వచ్చిన వినియోగదారులంతా కాకి విషయం తెలుసుకొని ముక్కున వేలేసుకున్నారు. ఈ కాకి తెలివినీ మెచ్చుకుంటున్నారు. రుచి బాగా లేకపోయినా కాకి గోల చేస్తుందని యజమాని చెబుతుండడం కోస మెరుపు.



# ఘనంగా కల్లుగీత కార్మిక సంఘం 68వ వార్షికోత్సవం

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:**ఆదివారం రోజు కల్లుగీత కార్మిక సంఘం కేజీ కేఎస్ 68వ వార్షికోత్సవ సభను బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. గౌడ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వంగ సదానందం గౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొని సౌవార్ధ సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌడ కల్లుగీత కార్మికుల పోరాటాలు ఉద్యమాలతో ప్రభుత్వాల పై ఒత్తిడి తెచ్చి అనేక జీవోలు సాధించుకున్నాం కానీ ఇప్పుడున్న ప్రభుత్వాలు ఉద్యమాలు చేసిన సమస్యలను పట్టించుకోవడం లేదు అందువలన గౌడులు గీతా కార్మికుల అంతా చైతన్యవంతులై మిలిటెంట్ ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు కేజీ కేఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మేకపోతుల వెంకటరమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ వార్షికోత్సవంలో బిసి పొలిటికల్ ఫ్రెండ్ చైర్మన్ బాలగోని బాలరాజు, గౌడ్ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర చైర్మన్ ఆయిలి వెంకన్న గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ అంబాల నారాయణ గౌడ్, గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎలికట్టే విజయ్ కుమార్ గౌడ్, తదితర నాయకులు పాల్గొని తమ సందేశాన్ని ఇచ్చారు. అనంతరం కేజీ కేఎస్ నాయకులు వంగ సదానందం గౌడ్ తో పాటుగా హాజరైన అతిరథ మహారథులకు మెమొంటోలు అందించి శాలువాల తో ఘనంగా సత్కరించడం జరిగింది.

# 'కొందరు అతి చేస్తున్నారు'..

## విమర్శలపై డీకే శివకుమార్



**బెంగళూరు :** బెంగళూరు రహదారుల దుస్థితి, ట్రాఫిక్ సమస్యలపై కొంతకాలంగా కర్ణాటక సర్కారుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బయో కాన్ ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ వంటి ప్రముఖులు ఈ సమస్యలను లేవనెత్తారు. ఈ వ్యవహారంపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మరోసారి స్పందించారు. విమర్శలు స్వీకరించేందుకు తాను సిద్ధమేనని, కానీ.. కొంతమంది అతి చేస్తున్నారని వ్యాఖ్యానించారు. అటువంటి వాటికి తాను భయపడనని చెప్పారు. "బెంగళూరు నగర జనాభా 1.40 కోట్లు. స్థానికంగా 1.23 కోట్ల వాహనాలు రిజిస్టర్ అయ్యాయి. రోజుకు కొత్తగా మూడు వేల వాహనాలు రిజిస్టర్ అవుతున్నా యని రవాణాశాఖ మంత్రి చెబుతున్నారు. ఉపాధి, విద్య, ఇతర పనుల కోసం 70 లక్షల మంది బెంగళూరుకు వస్తుంటారు. నగర జనా భా పెరుగుతోంది. ఆయా సమస్యలను పరిష్కరిం చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రజలు కాంగ్రెస్ సర్కారుకు ఒక అవకాశం ఇచ్చారు. మేం సేవ చేయాలనుకుంటున్నాం" అని ఓ కార్యక్రమంలో శివకుమార్ తెలిపారు. "ఇక్కడ వ్యాపారాలు ప్రారంభించిన కొంతమంది నేడు ఉన్నత స్థాయికి ఎదిగారు. అయితే.. వారు తమ మూలాలను మర్చిపోయారు. ట్వీట్‌ల ద్వారా విమర్శలు చేస్తున్నారు. నేను విమర్శలను స్వాగతిస్తున్నాను. ఈ విషయంలో ఎటువంటి సమస్య లేదు. ఎందుకంటే.. అవి ప్రజాస్వామ్య విలువలను పెంచుతాయి. కానీ.. ఈ ముసుగు లో కొందరు అతి చేస్తున్నారు. ఇటువంటి విషయాలు నన్ను ఇబ్బంది పెట్టవు. ప్రజలు మాకు ఒక అవకాశం ఇచ్చారు. మేం వారికి సేవ చేయాలనుకుంటున్నాం" అని డీకే వ్యాఖ్యా నించారు. రోడ్లపై గుంతల సమస్యను వాట్సప్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు పౌరులకు అవకాశం కల్పించినట్లు డిప్యూటీ సీఎం గుర్తుచేశారు. దేశంలో ఎక్కడా ప్రజలకు ఇలాంటి అవకాశం లేదన్నారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర హెూంశాఖ మంత్రి జి.పరమేశ్వర సైతం స్పందించారు. సమస్యలపై బహిరంగ ప్రకటనలు, మీడియా ముందు మాట్లాడటం వంటివి చేయకుండా.. సీఎం, లేదా బెంగళూరు ఇన్‌ఛార్జి మంత్రి దృష్టికి తీసుకురావాలని సూచించారు. సంబంధిత ప్రకటనలు నగరంపై ఎలాంటి ప్రభావం చూపుతాయో ఆలోచించాలన్నారు.

# కాంగ్రెస్‌కు రైల్వేశాఖ కౌంటర్

## '12వేల ప్రత్యేక రైళ్ల జాబితా ఇదిగో' అంటూ పోస్టు

న్యూఢిల్లీ : దీపావళి, ఛఠ్ పూజ వంటి పండుగల నేపథ్యంలో 12వేల ప్రత్యేక రైళ్ల సర్వీసులు నడుపుతున్నామంటూ రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ చేసిన విమర్శల్ని రైల్వేశాఖ తిప్పికొట్టింది. 'రీల్ మినిస్టర్.. 12వేల రైళ్లు ఎక్కడ?' అని విమర్శిస్తూ కాంగ్రెస్ పార్టీ పెట్టిన పోస్టుకు కౌంటర్ ఇచ్చింది. ఈ మేరకు పండుగ సీజన్ వేళ ప్రయాణికుల సౌలభ్యం కోసం అక్టోబర్, నవంబర్ మాసాల్లో దేశ వ్యాప్తంగా నడిపే 12వేలకు పైగా ప్రత్యేక రైళ్ల సర్వీసుల జాబితాను 'ఎక్స్'లో షేర్ చేసింది. పండుగ సీజన్‌లో ప్రయాణికులు తమ కుటుంబాల్ని కలిసేందుకు రైలు సేవలను ఉపయోగిస్తున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో ఆయా కుటుంబాలను ఆందోళనకు గురిచేసేలా తప్పుదారి పట్టించే వీడియోలను షేర్ చేయొద్దని విజ్ఞప్తి చేసింది.

## కీర్తి క్రియేషన్స్ డిజిటల్ స్టూడియో ప్రారంభోత్సవంలో పాల్గొన్న

# గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

- మనలోని భావాలకు భాష్యం చూపే కళ ఫోటోగ్రఫీ
- మనం ఎప్పుడో దిగిన ఫోటో మన జ్ఞాపకాలు గుర్తుచేసేది ఫోటోగ్రఫీ



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోనీ నల్లగండ్ల మెయిన్ రోడ్ లో విజయ్ అధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కీర్తి క్రియేషన్స్ డిజిటల్ స్టూడియో ను గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ.. వారు మనలోని భావాలకు భాష్యం చూపే కళ ఫోటోగ్రఫీ" అని, ప్రతి క్షణాన్ని అందంగా స్మృతులుగా నిలిపే ఈ కళ సమాజానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. యువకులు సృజనాత్మక ఆలోచనలతో ముందుకు రావడం సంతోషకరమని, విజయ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కీర్తి క్రియేషన్స్ డిజిటల్ స్టూడియో మరిన్ని శాఖలకు విస్తరిస్తూ, ప్రొఫెషనల్ ఫోటోగ్రఫీ రంగంలో మైలురాయిగా నిలవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా యువత తమ ప్రతిభను సృజనాత్మకతతో మిళితం చేస్తూ స్వయం ఉపాధి మార్గాలను సృష్టించుకోవాలని, ఈ తరహా స్టార్టప్స్ ప్రోత్సాహకరమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షులు హనుమంత్ నాయక్, సీనియర్ నాయకులు అరుణ్ గౌడ్, స్థానిక నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హరిహర ప్రియం కార్తీక మాసం

మన తెలుగు వాళ్లతో పాటు దేశంలో చాంద్రమాసం పాటించే వారికి దీపావళి అమావాస్య మరుసటి రోజు నుంచి కార్తీకం మొదలవుతుంది. సౌర మాసం పాటించే తమిళలకు సూర్యుడు వృశ్చిక రాశిలో అడుగుపెట్టినప్పటికి ప్రారంభం అవుతుంది. బెంగాలీలకు ఒరియా వాళ్లకు ఆశ్వీజ పున్నమి మరుసటి రోజు నుంచి కార్తీకం మొదలవుతుంది. కార్తీక మాసంలో చాలా పర్వదినాలు ఉన్నాయి. కార్తీకమాసం తొలి రోజున బలిపాడ్యమే గోవర్ధన పూజా రెండో రోజున బాయిదూజ్( భగిన హస్త భోజనం ) శుద్ధ చవితి రోజున నాగుల చవితి శుక్లపక్షంలో వచ్చే కార్తీక శుద్ధ ఏకాదశి ఆ మర్నాడు వచ్చే క్షీరాబ్ది ద్వాదశి కార్తీక పున్నమి ఈ నెలలో వచ్చే ప్రధాన పర్వదినాలు. కార్తీక పున్నమి హిందువులకు మాత్రమే కాదు సిక్కులకు జైనులకు కూడా ఇది అత్యంత పవిత్రమైన రోజు.



> హిందూ సంప్రదాయంలో కార్తీకమాసానికి గొప్ప ఆధ్యాత్మిక ప్రశక్తి ఉంది. హిందూ పంచాంగం ప్రకారం ఎనిమిదో నెల అయిన కార్తీకం శివ, కేశవులు ఇద్దరికీ ప్రీతిపాత్రమైన మాసం. ఈనెల పొడవునా శివాలయాలు వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడుతూ కనిపిస్తాయి. ఇక పవిత్ర క్షేత్రాలలో అయితే భక్తుల రద్దీ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిన అవసరం లేదు.

## దేవతల దీపావళి

దీపావళి అమావాస్యకు 15 రోజుల తర్వాత వచ్చే కార్తీక పున్నమిని దేవ దీపావళిగా అభివర్ణిస్తారు. నరుక చతుర్దశి మరుసటివాడు వచ్చే మానవుల దీపావళి అయితే కార్తీక దీపావళి దేవతల దీపావళి అన్న మాట. కార్తీక పున్నమి వేడుకలు కార్తీక శుద్ధ ఏకాదశినికి మొదలవుతాయి. కార్తీక శుద్ధ ఏకాదశిని ప్రబోధ ఏకాదశి అని ప్రబోధిని ఏకాదశి అని అంటారు కార్తీక శుద్ధ ఏకాదశివితో చతుర్మాస వ్రతం పూ-ర్తవుతుంది.

> **ఆషాఢశుద్ధ ఏకాదశి రోజున యోగా నిద్రలో జారుకున్న మహావిష్ణువు కార్తీక శుద్ధ ఏకాదశి రోజున మేల్కొంటాడు కార్తీక పున్నమినాటి దేవదీపావళి వేడుకలకు ఏకాదశివి నుంచేసన్నాహాలు మొదలవుతాయి. రాజస్థాన్లోని బ్రహ్మ దేవుడి ఆలయం ఉన్న పుష్కర క్షేత్రంలో బ్రహ్మ దేవుని రీత్యార్థం జరిగే పుష్కరమేల ఏటా కార్తీక్ శుద్ధ ఏకాదశి నుంచి కార్తీక పున్నమి వరకు అంగరంగ వైభవంగా జరుగుతుంది.**

ఈ ఐదు రోజులు భక్తులు పుష్కర తీర్థంలో పవిత్ర స్నానాలు ఆచరిస్తారు. పుష్కర మేళాలో పాల్గొనడానికి దేశం నలుమూలన నుంచి వచ్చే సాధువులు ఇక్కడ సమీపంలోని గుహలలో తల దాచుకుంటారు. దాదాపు రెండు లక్షలకు పైగా భక్త జనవాహినితో పాటు పాతిక వేలకు పైగా ఒంటెలతో పుష్కరమేళాలో జరిగే ఊరేగింపు చూసి తీర వలసిందే. ఇది ఆసియాలోనే పెద్ద ఒంటెల ఊరేగింపుగా గుర్తింపు పొందింది. ఇది ఇలా ఉంటే సైవక్షేత్రాలలో తలమానికమైన వారణాసిలో దేవ దీపావళి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహిస్తారు.





గంగానది ఒడ్డున అన్ని ఘాట్లు లెక్కలేని దీపాలతో నిర్మిట్లు కలుపుతూ కనువిందు చేస్తాయి. కాశీ క్షేత్రంలో గంగ మహోత్సవం నుంచి పున్నమి వరకు వైభవోపేతంగా జరుగుతుంది. పరమశివుడు కార్తీక పున్నమి రోజున త్రిపుర సూర్యుడిని సంహరించాడు ముల్లోకాలను ముప్పు తిప్పలు పెడుతూ పీడించిన త్రిపురాసురుని పీడ విరగడ కావడంతో దేవతలు ఆ రోజున దీపావళి పండుగ చేసుకున్నారని ప్రతీతి అందుకే ఈ పున్నమిని త్రిపురారి పౌర్ణమి అని కూడా అంటారు కార్తీక పౌర్ణమి నాడు చిన్నా పెద్ద దేవాలయాలని అసంఖ్యాకమైన దీపాల వెలుగులతో దగలగలాడుతూ కనిపిస్తూ కనువిందు చేస్తాయి. నిత్య దీపారాధన చేయని వారు కార్తీక పున్నమి నాడు 365 ఒత్తులు ఒకటిగా చేసి ఆవు నేతితో తడిపి మట్టి ప్రమిద లేదా కొబ్బరి చిప్పలో దీపం వెలిగిస్తే ఏడాది పొడవు నా దీపారాధన చేసిన ఫలం దక్కుతుందని ప్రతిదీ కార్తీక పున్నమి ఉదయం విష్ణు పూజకు రాత్రి శివ పూజకు అనుకూలమైనవి శివ కేశవులు అనుగ్రహం కోరేవారు ఈరోజు ఉదయం వైష్ణవ దేవాలయంలో అర్చనలు జరిపిస్తారు రాత్రి వేళలో శివాలయాలలో అర్చనలు అభిషేకాలు నిర్వహిస్తారు చాలా ప్రాంతాలలో కార్తీక పున్నమి రోజు తులసి చెట్టును శ్రీ మహాలక్ష్మి గా ఉసిరి కొమ్మను మహావిష్ణువుగా భావించి భక్తిశ్రద్ధలతో వాటికి కళ్యాణం జరిపించే సాంప్రదాయం కూడా దేశంలో ఉంది.



# గడ్డి అన్నవరక్షేత్రంలో కార్తీక మాసం విశేష సేవలు

## దేవాలయ చైర్మన్ డి. లింగారెడ్డి, కోశాధికారి వక్క లంక శ్రీనివాసరావు

రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా గడ్డి అన్నవరక్షేత్రం శ్రీశ్రీశ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయంలో, రానున్న కార్తీక మాసాన్ని పురస్కరించుకొని విశేష సేవలకు, రంగం సిద్ధం చేయడం జరిగింది అని ఆలయ చైర్మన్, డి లింగారెడ్డి, కోశాధికారి వక్క లంక శ్రీనివాసరావు తెలిపారు . ఆదివారంనాడు వారు మీడియాతో మాట్లాడుతూ కార్తీక మాస సందర్భంగా ఈనెల 22వ తేదీ నుండి వచ్చేనెల 20వ తేదీ వరకు కార్తీకమాసంలో హరిహర క్షేత్రంలో భక్తులు దేవాలయంలో కోలాహలంగా గడిపేందుకు శివుడు విష్ణువుడి పూజలు నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని గడ్డి అన్నవరక్షేత్రంలో శివలింగానికి అభిషేకం సత్యనారాయణ స్వామికి వ్రతాలు ప్రతిరోజూ నిర్వహించడం జరుగుతుందని మీరు కూడా ఈ క్షేత్రంలో పూజలు నిర్వహించుకుంటూ కార్తీక మాసంలో భగవంతుడి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. సత్యదేవుని సన్నిధిలో సాయంత్రం ఆకాశ దీపారాధన కార్యక్రమం కార్తీక పౌర్ణమి రోజు అనగా వచ్చేనెల 5వ తేదీన సత్య దేవుడికి ఉదయం 6:30 నుండి సాయంత్రం 8 గంటల వరకు వ్రతాలు చేసుకోవచ్చునని అందుకు 1,500 రూపాయలు మరియు 800 చెల్లించి ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చునని కోరారు. నవంబర్ 5వ తేదీ కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఉంటుందని నెల రోజులపాటు కార్తీకదీపం పూజ మహా హారతి కొనసాగుతుందని అన్నారు. ఈనెల 22వ తేదీన విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ఏక వార రుద్రాభిషేకం ఉంటుందని వచ్చే నెల 18 జ్యోతిర్లింగా భక్తులచే దీపాలంకరణ మహన్యాస ఏకాదశవరం రుద్రాభిషేకం, ఉంటుందని పేర్కొన్నారు మీ పుట్టినరోజు పెళ్లిరోజు, దేవాలయ ప్రాంగణంలో వ్రతాలు చేసుకొని అన్నప్రసాద వితరణ చేసుకోవచ్చుని, చైర్మన్ లింగారెడ్డి కోశాధికారి వక్కలంక శ్రీనివాసరావు తెలిపారు.





### పవిత్ర మాసం మాసం కార్తీకం

హరిహర ప్రియం కార్తీక మాసం అని, ఈ మాసంలోనే అయ్యప్ప భక్తులు, మాల ధారణం తో నియమాల తోరణం పాటించవలసి ఉంటుందని, వారు పేర్కొన్నారు. కానీ సమాజంలో ఈ మధ్య అయ్యప్ప భక్తులు, ఎక్కడో అయ్యప్ప గురువు, హోటల్ తెరిచారని, అందులో ఉదయం సాయంత్రం టీ కాఫీలు సేవిస్తూ, కాలక్షేపం చేయడం సనాతన ధర్మానికి విరుద్ధమని, కొంతమంది మిర్చి బజ్జీలు తింటూ హరిహర ప్రియ కార్తికాన్ని అపహాస్యం పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏకభుక్తం, నేలపై పరుండడం లాంటి కార్యకలాపాలు కొనసాగించేందుకు వెనకాడుతున్నారని అలాంటివారు స్వామి వారి కృపకు పాత్రులు కాలేరని అన్నారు. మన తెలుగు వాళ్లతో పాటు దేశంలో చాంద్రమాసం పాటించే వారికి దీపావళి అమావాస్య మరుసటి రోజు నుంచి కార్తీక మొదలవుతుందని సౌర మాసం పాటించే తమిళలకు సూర్యుడు వృశ్చిక రాశిలో అడుగుపెట్టినప్పటికీ ప్రారంభమవుతుందని బెంగాలీలకు ఒరియా వాళ్లకు ఆశ్వీజ పున్నమి మరసటి రోజు నుండి కార్తీక మొదలవుతుందని కార్తీక మాసంలో చాలా పర్వదినాలు ఉంటాయని, కార్తీక పున్నమి హిందువుల మాత్రమే కాదు సిక్కులకు జైనులకు కూడా అత్యంత పవిత్రమైన మాసం అని, తమిళనాడులోని అయ్యప్ప స్వామిని దర్శించుకునే, భక్తులు నియమాలను పాటిస్తూ, స్వామివారికృపకు పాత్రులు కావాలి కానీ, ధర్మం తప్పకుండా పూజలు చేయాలని ఆకాంక్షించారు.

# ట్రంప్ కఠిన విధానాలకు
# వ్యతిరేకంగా నిరసనలు





## లక్షల మంది వీధుల్లోకి..

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠిన విధానాలకు వ్యతిరేకంగా దేశ ప్రజలు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. నిరసన కారులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి నినాదాలు చేశారు. న్యూయార్క్, వాషింగ్టన్ డీసీ, షికాగో, లాస్ఏంజెలెస్ సహా మొత్తం 50 నగరాల్లో ఈ భారీ నిరసనలు జరిగాయి. కెనడాతో పాటు బెర్లిన్, రోమ్, పారిస్, స్వీడన్‌లలోని యూఎస్ రాయబార కార్యాలయాల వెలుపల కూడా ట్రంప్‌నకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. అధికారం చేపట్టినప్పటి నుంచి ట్రంప్.. వలసల నియంత్రణ చర్యలు, విశ్వవిద్యాలయాలకు నిధులు తగ్గించడం, అనేక రాష్ట్రాల్లో నేషనల్ గార్డ్ దళాలు మోహరించడం వంటి అనేక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా తాజా నిరసనలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. దేశవ్యాప్తంగా 2,500 కంటే ఎక్కువ ప్రదర్శనలకు ప్రణాళిక చేసినట్లు వెల్లడించారు. బారోగ్‌లలో శాంతియుతంగా నిరసనలు తెలిపేందుకు లక్ష మందికి పైగా ప్రజలు గుమిగూడారని న్యూయార్క్ పోలీస్ డిపార్ట్‌మెంట్ తెలిపింది. ఈ క్రమంలో ఎలాంటి అరెస్టులు జరగలేదని వెల్లడించింది. ఇండివిజిబుల్ సహ వ్యవస్థాపకురాలు లియా గ్రీన్ బర్గ్ ఈ ప్రదర్శనలకు ప్రాతినిధ్యం వహించారు. ఈ నిరసనలకు డెమోక్రాట్లతో సహా పలు సంఘాలు, ప్రముఖ వ్యక్తుల నుంచి భారీ మద్దతు లభించింది. ఈ నిరసన ప్రదర్శనకు సంబం ధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. వీటిని రిపబ్లికన్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఇవి 'హేట్ అమెరికా' నిరసనలుగా అభివర్ణించింది. ఇదిలా ఉండగా.. ఓ వైపు నో కింగ్స్ నిరసనలు జరుగుతుండగా ట్రంప్ రాజకీయ ప్రచార బృందం పోస్టు చేసిన వీడియో చర్చనీయాంశంగా మారింది. అధ్యక్షుడు ట్రంప్ రాజు దుస్తులు, కిరీటం ధరించి ఉన్నట్లుగా ఉన్న ఏఐ వీడియో అది. నెట్టింట ఇది తెగ వైరల్ అవుతుంది. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన పదినెలల్లో ఆయనకు వ్యతిరేకంగా మూడు నిరసనలు జరగడం గమనార్హం.

## ఏఐ వీడియోతో వెక్కిరించిన ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠిన విధానాలకు వ్యతిరేకంగా దేశ ప్రజలు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. లక్షల మంది రోడ్లపైకి వచ్చి నినాదాలు చేశారు. ఈ నిరసనలపై అమెరికా అధ్యక్షుడు తనదైన శైలిలో స్పందించారు. తనకు వ్యతిరేకంగా నిరసన చేపడుతున్న ప్రజలను వెక్కిరిస్తూ.. పలు ఏఐ వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. అందులో ట్రంప్ తలపై కిరీటంతో రాజులాగా ఓ యుద్ధ విమానంలో వెళు_న్నట్లు రూపొందించారు. అమెరికా వీధుల్లో ఆయనకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్న ఆందోళనకారులపై విమానం నుంచి బురదను జారవిడుస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఆందోళన కారుల్లో ట్రంప్‌ను తరచుగా విమర్శించే డెమోక్రటిక్ కార్యకర్త హ్యారీ సిస్సన్ ఉన్నట్లు రూపొందించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ షేర్ చేసిన మరో ఏఐ వీడియోలో ట్రంప్ కిరీటం, రాజ దుస్తులు ధరిస్తున్నట్లు ఉంది. అనంతరం ట్రంప్ ముందు నాన్సీ పెలోసి, ఇతర డెమోక్రటిక్ పార్టీ నేతలు మోకరిల్లుతున్నట్లు కనిపించింది.



## రష్యా కీలక గ్యాస్ ప్లాంట్‌పై
## ఉక్రెయిన్ దాడి

**ఉక్రెయిన్ :** రష్యాలోని ఓరెన్‌బర్గ్ ప్రాంతాంలోని అతిపెద్ద గ్యాస్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకొని ఉక్రెయిన్ డ్రోన్లు విరుచుకుపడ్డాయి. కీవ్‌కు తూరువైపు 1,700 కిలోమీటర్ల దూరం చొచ్చుకొచ్చి మరీ ఈ దాడి చేయడం గమనార్హం. ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి దాడుల శక్తిని గణనీయంగా పెంచుకొందన డానికి ఈ దాడి ఉదాహరణగా నిలిచింది. ఈ దాడి కారణంగా ప్లాంట్లలోని ఓ యూనిట్‌లో మంటలు చెలరేగాయి. ఆ తర్వాత వీటిని అదుపులోకి తెచ్చినట్లు ఆ ప్రాంత గవర్నర్ వెల్లడించారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని వెల్లడించారు. దాడి చోటు చేసుకొన్న ప్రదేశం జనావాసాలకు అతి దగ్గరగా ఉందని చెప్పారు. రష్యాలోని సుదూర ప్రాంతాల్లో కూడా ఉక్రెయిన్ దళాలు డ్రోన్లు దాడులు చేస్తున్నాయి. గత నెల దాదాపు 2,000 కిలోమీటర్ల మేరకు లోపలకు చొచ్చుకొచ్చి దాడికి తెగబడ్డ ఘటనలున్నాయి. రష్యా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలకు ఇది సవాలుగా మారింది. సైబీరియా, ఊరల్ పర్వతాల్లో చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకొంటున్నాయి. తాజాగా సమర రీజయన్‌లో కూడా డ్రోన్ దాడి జరిగినట్లు తెలుస్తోంది. అయితే స్థానికులు మాత్రం ఇది చమురు రిఫైనరీని లక్ష్యంగా చేసుకొన్నట్లు చెబుతున్నారు. కానీ, ఈ దాడిపై గవర్నర్ మాత్రం ఎటువంటి సమాచారం వెల్లడించలేదు.



## మా నేషనల్ టైమ్ సెంటర్‌పై
## అమెరికా సైబర్ దాడి

### చైనా తీవ్ర ఆరోపణలు

**చైనా :** తమ దేశంలో ప్రామాణిక సమయాన్ని పర్యవేక్షించే నేషనల్ టైమ్ సెంటర్‌పై అమెరికా సైబర్ దాడి చేసినట్లు చైనాకు చెందిన మినిస్ట్రీ ఆఫ్ స్టేట్ సెక్యూరిటీ ఆరోపించింది. ఈ విషయాన్ని సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక కథనంలో పేర్కొంది. ఈ హ్యాకింగ్ వెనుక అమెరికా నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ హస్తం ఉన్నట్లు వెల్లడించింది. మార్చి 2022లో తొలిసారి ఈ సైబర్ దాడులు మొదలైనట్లు పేర్కొంది. నేషనల్ టైమ్ సెంటర్‌లోని ఉద్యోగుల ఫోన్లు, కంప్యూటర్ల నుంచి సున్నితమైన సమాచారాన్ని అమెరికన్లు తస్కరించినట్లు చెప్పింది. ఈ ఆరోపణలపై అమెరికా ఇప్పటి వరకు స్పందించలేదు. టైమ్ సెంటర్ ఉద్యోగులు వాడే విదేశీ ఫోన్లలోని మెసేజింగ్ యాప్‌లో ఉన్న బలహీనతలను ఆధారంగా చేసుకొని హ్యాకింగ్‌కు పాల్పడినట్లు చైనా పేర్కొంది. అమెరికా, ఐరోపా, ఆసియా వ్యాప్తంగా ఉన్న వర్చువల్ సర్వర్లను దాడులకు వాడుకొన్నట్లు పేర్కొంది. దీనికి సంబంధించిన బలమైన ఆధారాలను చైనా సైబర్ సెక్యూరిటీ సంస్థలు సేకరించినట్లు వెల్లడించింది. దీంతో పాటు తమ రక్షణ వ్యవస్థను కూడా అప్‌గ్రేడ్ చేసుకొన్నట్లు చెప్పింది. చైనాలోని షాంక్సీ ప్రావిన్స్‌లోని షియాన్ నగరంలో నేషనల్ టైమ్ సర్వీస్ సెంటర్ ఉంది. చైనీస్ ఆకాడమీ ఆఫ్ సైన్సెస్ దీనిని నిర్వహిస్తోంది. దేశంలోని ప్రామాణిక సమయాన్ని అత్యంత కచ్చితత్వంతో నిర్వహిస్తుంది. ముఖ్యంగా కమ్యూనికేషన్స్, ఫైనాన్స్, పవర్, ట్రాన్స్‌పోర్ట్, మ్యాపింగ్ డిఫెన్స్ రంగాలకు ఇది అత్యంత కీలకమైంది.

## పాక్‌కు మద్దతు ఇచ్చిన ఎఫెక్ట్

### తుర్కియే, అజర్ బైజన్‌కు తగ్గిన భారత పర్యటకులు




**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్ వేళ తుర్కియే, అజర్ బైజన్ దేశాలు పాక్‌కు మద్దతు ఇచ్చినందుకు ఆ దేశాల పర్యాటక రంగంపై ప్రతికూల ప్రభావం పడింది. భారత్ నుంచి ఆయా దేశాలకు వెళ్లే పర్యటకుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. తాజా గణాంకాల ప్రకారం అజర్‌బైజన్‌కు వెళ్లే భారతీయుల సంఖ్య 56 శాతం తగ్గగా.. తుర్కియేకు అది 33.3 శాతంగా నమోదైంది. కొన్నేళ్ల నుంచి ఇరు దేశాలు భారత్‌లో భారీ ప్రచారం చేసి పర్యటకులను ఆకర్షించాయి. దీంతో పెద్ద సంఖ్యలో భారతీయులు అక్కడికి వెళ్లడం మొదలుపెట్టారు. మరోవైపు ఆయా ప్రాంతాలకు డైరెక్ట్ ఫ్లైట్లు ఉండటం కూడా దీనిని పెంచింది. అజర్‌బైజన్ ప్రభుత్వ టూరిజం బోర్డు భారత మార్కెట్‌ను కీలకంగా ఇప్పటికే గుర్తించింది. ఈ క్రమంలో మేలో పాకిస్థాన్‌పై భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పుడు తుర్కియే, అజర్ బైజన్‌లు బహిరంగంగానే ఇస్లామాబాద్‌కు మద్దతు తెలిపాయి. తుర్కియే ఆయుధ నిపుణులు, వ్యూహకర్తలు పాకిస్థాన్‌కు చేరుకొని యుద్ధంలో ప్రత్యక్ష సాయం చేసినట్లు ప్రచారం జరిగింది. మే నుంచే ఈ రెండు దేశాలకు బుకింగ్స్‌ను పర్యటకులు రద్దు చేసుకున్నారు. నాటి నుంచి సందర్శకుల సంఖ్య క్రమంగా తగ్గిపోతూ వస్తోంది. భారత్‌కు చెందిన ట్రావెల్ సర్వీస్ ప్రొవైడర్లు కూడా ఈ దేశాలకు బుకింగ్స్‌ను నిలిపేసి నిరసన వ్యక్తం చేశారు. ఇక మేక్‌మైట్రిప్, ఈజ్‌మై ట్రిప్ వంటి సంస్థలు ఆ దేశాలకు అవసరమైతేనే ప్రయాణం చేయాలని పర్యటకులకు సూచనలు కూడా ఇవ్వడం గమనార్హం. మే వరకు అజర్‌బైజన్‌కు వెళ్లే భారతీయుల సంఖ్య ఏటా 33 శాతం వృద్ధి చెందుతూ వచ్చింది. కానీ, ఆ తర్వాత నాలుగు నెలల్లో ఒక్కసారిగా 56 శాతం పతనమైంది. సాధారణంగా ఆ నాలుగు నెలల్లో లక్ష వరకు ఉండాల్సిన పర్యటకుల సంఖ్య 44 వేలకు పడిపోయింది. ఆపరేషన్ సిందూర్‌కు ముందు నాలుగు నెలల్లో ఆ దేశానికి 81 వేల మంది భారతీయులు వెళ్లారు. ఇక మే నుంచి ఆగస్టు వరకు తుర్కియేకు వెళ్లే భారతీయుల సంఖ్య మూడో వంతు తగ్గింది. ఈ సీజన్‌లో గతేడాది 1.36లక్షల మంది సందర్శించగా.. ఈ సారి 90,400కు పరిమితమైంది.

## ఆ ప్రాంతం అప్పగిస్తేనే
## ఉక్రెయిన్‌తో శాంతి

### ట్రంప్‌నకు తేల్చిచెప్పిన పుతిన్



**రష్యా :** ఉక్రెయిన్‌లోని అత్యంత కీలకమైన ప్రాంతాన్ని తమకు అప్పగించాల్సిందేనని మాస్కో పట్టుబడుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత పుతిన్ మధ్య గత వారం జరిగిన సుదీర్ఘ ఫోన్‌కాల్ సంభాషణలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చినట్లు శ్వేతసౌధం అధికారులను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్ట్ కథనంలో పేర్కొంది. దొనెట్స్క్ ప్రాంతాన్ని మాస్కో సేనలు స్వాధీనం చేసుకోవడానికి దాదాపు 11 ఏళ్ల నుంచి వివిధ రకాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నాయి. తాజాగా దీనిని తమకు అప్పగించి తీరాల్సిందేనని పుతిన్ పట్టుపడుతుండటంతో.. యుద్ధం కొనసాగుతోంది. ఇటీవల ఫోన్ కాల్‌లో పుతిన్ ఓ ప్రతిపాదనను ట్రంప్ ఎదుట ఉంచినట్లు తెలుస్తోంది. ఇప్పటి తమ సేనల ఆధీనంలో ఉన్న జపొరిజియా, ఖేర్సాన్ ఉక్రెయిన్‌కు అప్పజెప్పేందుకు సానుకూలతను వ్యక్తం చేశారు. దీనికి ప్రతిగా ఉక్రెయిన్ దొనెట్స్క్ ప్రాంతాన్ని సంపూర్ణంగా తమకు అప్పగించాలని కోరినట్లు వాషింగ్టన్ పోస్టు కథనంలో వెల్లడించింది. వాస్తవానికి అలాస్కాలో జరిగిన ట్రంప్–పుతిన్ భేటీతో పోలిస్తే తాజా ఫోన్‌కాల్‌లో రష్యా కొంత మెత్తబడినట్లు తెలుస్తోంది. అయితే అదే రోజు ఉక్రెయిన్ అధినేత జెలెన్స్కీతో కూడా ట్రంప్ భేటీ అయ్యారు. నాడు అమెరికా అధినేత విడుదల చేసిన ప్రకటనలో మాత్రం పుతిన్ డిమాండ్లను ప్రస్తావించలేదు. పుతిన్ డిమాండ్లపై ఉక్రెయిన్ లేదా ఐరోపా సానుకూలంగా లేనట్లు తెలుస్తోంది. ఎటువంటి ప్రయోజనం లేకుండానే.. శరీరంలోని ఓ భాగాన్ని ఇచ్చేసినట్లు ఉందని నిపుణులు అభివర్ణించారు. వాషింగ్టన్ పోస్టు కథనంపై క్రెమ్లిన్ లేదా వైట్‌హౌస్ స్పందించలేదు. ఇప్పటికే ఉక్రెయిన్‌లోని ఐదో వంతు భూభాగాన్ని రష్యా ఆక్రమించిన విషయం తెలిసిందే. మరోవైపు ఉక్రెయిన్‌కు సరికొత్త ఆయుధాలు ఇచ్చే విషయంలో అమెరికా ఆచితూచి వ్యవహరిస్తోంది. తోమహాక్ క్రూజ్ క్షిపణులే లక్ష్యంగా అగ్రరాజ్య పర్యటనకు వచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీకి నిరాశ ఎదురైంది. ట్రంప్‌తో శుక్రవారం వాషింగ్టన్‌లో జరిపిన చర్చల్లో తోమహాక్ క్షిపణుల సరఫరాపై అమెరికా నుంచి ఎలాంటి హామీ లభించలేదు. రష్యా, ఉక్రెయిన్‌లు వెంటనే యుద్ధం ఆపాలన్న ప్రకటనతోనే ట్రంప్ సరిపుచ్చారు. దాదాపు 2,500 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం గల తోమహాక్‌లను తమకు అమెరికా సరఫరా చేస్తే రష్యా సైనిక లక్ష్యాలపై దాడి చేసి.. ఆ దేశాన్ని శాంతి ఒప్పందంపై సంతకం చేసేలా ఒత్తిడి తెస్తామని ఉక్రెయిన్ గత కొంతకాలంగా చెబుతోంది.

## భారతీయులను బహిష్కరించాలి

### అమెరికా నేత విద్వేషపూరిత వ్యాఖ్యలు



**యూఎస్ :** అమెరికాకు చెందిన రాజకీయ నేత చాండ్లర్ లాంగేవిన్ భారతీయులకు వ్యతిరేకంగా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం కలకలం రేపింది. యూఎస్‌లో ఉన్న ప్రతి భారతీయుడిని వెంటనే బహిష్కరించాలంటూ ఆయన పెట్టిన పోస్టులపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలో పామ్ బే నగర కౌన్సిల్ ఆయనపై చర్యలు తీసుకుంది. చాండ్లర్ లాంగేవిన్ ఫ్లోరిడాలోని పామ్ బే సిటీ కౌన్సిల్‌కు చెందిన యూఎస్ కన్జర్వేటివ్ నాయకుడు. ఆయన భారతీయులను ఉద్దేశిస్తూ పెట్టిన విద్వేషపూరిత పోస్టులపై అక్కడి భారతీయ అమెరికన్ గ్రూపులతో పాటు కాంగ్రెస్ సభ్యుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. గత నెల నుంచి లాంగేవిన్ భారతీయులకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతూ వచ్చారు. ఓ భారతీయ ట్రక్ డ్రైవర్ చేసిన ప్రమాదంలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయిందనే వార్తను లాంగేవిన్ పంచుకున్నారు. దీనికి 'అమెరికాలోని భారతీయులందరినీ వెంటనే బహిష్కరించాలి' అని రాసుకొచ్చారు. ఆ తర్వాత 'అమెరికా గురించి పట్టించుకునేందుకు ఒక్క భారతీయుడు కూడా లేరు. వారు మనల్ని ఆర్థికంగా దోపిడి చేస్తున్నారు. భారత్‌ను, ఆ దేశ ప్రజలను ప్రోత్సహించేందుకే ఇక్కడ ఉన్నారు. అమెరికన్ల కోసం మాత్రమే ఈ దేశం' అని మరో పోస్టులో వ్యాఖ్యానించారు. ఇటీవల 'ఈ రోజు నా పుట్టినరోజు. ప్రతి భారతీయుడి వీసాను రద్దు చేసి వెంటనే వారిని ఇక్కడి నుంచి బహిష్కరించాలి. ఇదే నా కోరిక' అంటూ పెట్టిన పోస్టుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ట్యాగ్ చేశారు. ఆయన వ్యాఖ్యల నేపథ్యంలో నగర కౌన్సిల్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో కౌన్సిల్ లాంగేవిన్‌పై చర్యలు తీసుకుంది. ఇక నుంచి ఆయన ఏదైనా అజెండాను ప్రవేశపెట్టాలనుకుంటే ముందే ఏకాభిప్రాయం పొందాల్సి ఉంటుంది. అంతేకాక.. కమిటీ నుంచి ఆయన్ను తొలిగించడంతో పాటు ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా చేసింది. ఈ చర్యలను లాంగేవిన్ తీవ్రంగా ఖండించారు.



## గాజా పౌరులపై దాడులకు
## హమాస్ ప్లాన్

### హెచ్చరించిన అమెరికా

**యూఎస్ :** సుదీర్ఘ యుద్ధం తర్వాత ఇజ్రాయెల్– హమాస్‌ల మధ్య ఇటీవల కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన సంగతి తెలిసిందే. దీంతో గాజాలో శాంతి నెలకొంది. ఈ క్రమంలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. గాజాలోని పౌరులపై దాడులు చేసేందుకు హమాస్ ప్రణాళికలు రచ్చించినట్లు తెలుస్తోంది. హమాస్ దాడుల ప్రణాళిక గురించి తమ వద్ద విశ్వసనీయ సమాచారం ఉందని అమెరికా విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ క్రమంలోనే హమాస్‌కు హెచ్చరికలు చేసింది. పాలస్తీనా పౌరులపై హమాస్ దాడి ప్రణాళిక.. కాల్పుల విరమణ ఒప్పందాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమేనని యూఎస్ పేర్కొంది. తమ మధ్యవర్తిత్వ ప్రయత్నాలతో సాధించిన గణనీయమైన పురోగతిని ఇది దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. హమాస్ ఈ దాడులకు పాల్పడితే.. గాజా ప్రజలను రక్షించడానికి, కాల్పుల విరమణ సమగ్రతను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తమకు అందిన ఈ సమాచారాన్ని ఈజిప్టు, ఖతార్, తుర్కియేతో సహా శాంతి ఒప్పందానికి హామీగా ఉన్న దేశాలకు తెలియజేసినట్లు యూఎస్ తెలిపింది. గాజాలో అంతర్గత రక్తపాతం కొనసాగితే లోపలకు చొరబడి చంపడం మినహా తమకు మరో మార్గం లేదని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హమాస్‌ను హెచ్చరించిన సంగతి తెలిసిందే. కాల్పుల విరమణ అమల్లోకి వచ్చాక ఆ ప్రాంతంలో అంతర్గత హింస గురించి తాను గతంలో తక్కువగా అంచనా వేశానన్నారు. ఈ క్రమంలోనే హమాస్ దాడులకు సంబంధించి తమ వద్ద పక్కా ప్రణాళిక ఉందంటూ యూఎస్ విదేశాంగ శాఖ పేర్కొనడం గమనార్హం. చాలాకాలం యుద్ధం తర్వాత కొన్నిరోజుల క్రితమే ఇజ్రాయెల్–హమాస్‌లు శాంతి ఒప్పందానికి అంగీకరించాయి. ఒప్పందంలో భాగంగా హమాస్ ఇప్పటికే తన చెరలోని బందీలను విడుదల చేయగా.. ఇజ్రాయెల్ తమ వద్ద ఉన్న పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టింది. 10 మంది బందీల మృతదేహాలను కూడా హమాస్ అప్పగించింది. ఇంకా 18 భౌతికకాయాలను అప్పగించాల్సి ఉంది.

జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో పండగ సీజన్‌లో దేశవ్యాప్తంగా అమ్మకాల మోత మోగిందని కేంద్ర ఆర్థికశాఖ వెల్లడించింది. దీపావళి వెలుగుల కంటే అమ్మకాల వృద్ధే దేదీప్యమానంగా వెలిగిపోయినట్లు పేర్కొంది. వాహన రంగం నుంచి ఇ-కామర్స్ వరకు ప్రతి రంగంలో ఈ వెలుగులు స్పష్టంగా కనిపించాయని వెల్లడించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కేవలం జీఎస్‌టీ రేట్లు తగ్గించడమే కాకుండా వినియోగదారుల నైతిక స్థైర్యాన్ని పెంచారని, దీనివల్ల నవరాత్రుల్లో దేశంలో అతిపెద్ద వినియోగతరంగాలను సృష్టించిందని పేర్కొంది. పండగలు, వివాహాల సీజన్ టర్నోవర్ రూ.7 లక్షల కోట్లను మించిపోయింది. దేశీయంగా ఇటీవలి కాలంలో వినియోగదారులు పెద్దఎత్తున చేసిన ఖర్చు ఇదే. పాత జీఎస్‌టీ రేట్ల చివరి రోజైన సెప్టెంబర్ 21న రూ.1.18 లక్షల కోట్ల మేర ఉన్న డిజిటల్ చెల్లింపులు, 22వ తేదీకల్లా అవి పది రెట్లు పెరిగి రూ.11.31 లక్షల కోట్లకు ఎగబాకాయి. ఢిల్లీలో పండుగ విక్రయాలు రూ.75 వేల కోట్లమేర జరిగినట్లు అంచనా. రూ.2,500లోపు దుస్తులపై రేట్లు తగ్గించడం వల్ల అహమ్మదాబాద్ నూలు వస్త్ర డిమాండ్ సుమారు 10% పెరిగింది.




# జీఎస్‌టీ ధమాకా.. అమ్మకాల మోత

## ప్రీమియం ఉత్పత్తుల హుషారు

వినియోగవస్తువుల అమ్మకాలు 40-45% పెరిగాయి. ఇందులో ప్రీమియం ఉత్పత్తులు ముందు వరుసలో ఉన్నాయి. హేయర్ సంస్థ 85% వృద్ధిని ప్రకటించింది. రూ.2.5 లక్షలకుపైబడిన ధరలున్న 85, 100 అంగుళాల టీవీలు దాదాపు అన్నీ అమ్ముడు-పోయాయి. రిలయన్స్ రిటైల్ అమ్మకాలు గత ఏడాదితో పోలిస్తే 20-25% పెరిగాయి. ఇందులో భారీ తెరల టీవీలు, స్మార్ట్‌ఫోన్లు అధికంగా ఉన్నాయి. విజయ్‌సేల్స్, ఎల్‌జీ, గోద్రెస్ అప్లయిన్సెన్ అన్నీ రెండంకెల వృద్ధిని ప్రకటించాయి.

## ధన్‌తేరస్ వాహన విక్రయాలు

మారుతీ సుజుకీ ఇండియా ధన్‌తేరస్ సందర్భంగా 50,000 కార్లకు పైగా విక్రయిస్తామని అంచనా వేసింది. హ్యుందాయ్ మోటార్ ఇండియా గత ఏడాది 14,000 కార్లను విక్రయించగా, ఈసారి 20 శాతానికి పైగా వృద్ధి నమోదు చేస్తామని తెలిపింది. 'సుమారు 41,000 డెలివరీలు చేశాం. మరో 10,000 మంది ఆదివారం డెలివరీలు తీసుకుంటామని తెలిపార'ని మారుతీ సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ వెల్లడించారు.




## ఇ-కామర్స్ జోరు..

అమెజాన్ ఇండియాను ఈ పండగల సీజన్‌లో 276 కోట్ల సార్లు వినియోగదారులు సందర్శించారు. ఇందులో 70% మంది ద్వితీయ, తృతీయశ్రేణి నగరాలవారే. మెట్రోనగరాల్లో అమెజాన్‌కు అదే రోజు, మరుసటి రోజు డెలివరీలు 29% పెరిగాయి. ద్వితీయ, తృతీయ శ్రేణినగరాల్లో రెండు రోజుల్లో చేసే డెలివరీలు 37% ఎగబాకాయి. తద్వారా ఇ-కామర్స్ గ్రామీణ, పట్టణ శివారుప్రాంతాల్లోకి వెళ్లినట్లు స్పష్టమవుతోంది. మీషో ప్లాట్‌ఫామ్‌నూ 206 కోట్ల సార్లు వినియోగదారులు సందర్శించారు. దసరా వారంలోనే 117 మిలియన్ గంటలు షాపింగ్ చేశారు.

## పండగ సీజన్‌లో కొనుగోళ్లు భారీగా పెరిగాయ్

### ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



ఢిల్లీ: జీఎస్‌టీ సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థపై గణనీయ ప్రభావాన్ని చూపుతున్నాయని, ఆశించిన ప్రయోజనాలు వినియోగదార్లకు చేరుతున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. దేశ వ్యాప్తంగా 54 వస్తువుల ధరల తగ్గింపును పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. పండగ సీజన్‌లో కొనుగోళ్లు భారీగా పెరిగాయన్నారు.

**3,169 ఫిర్యాదులొచ్చాయ్ :**

నవరాత్రి వేడుకల తొలిరోజు (సెప్టెంబరు 22) నుంచి జీఎస్‌టీ శ్లాబ్‌ల తగ్గింపు అమల్లోకి వచ్చినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. జీఎస్‌టీ సంస్కరణల ఫలితంగా కొనుగోళ్లు పెరిగాయి. కొన్ని వస్తువుల విషయంలో వ్యాపార సంస్థలు జీఎస్‌టీ రేటు తగ్గింపుతో వచ్చిన లాభాలను అంతకంటే ఎక్కువ మొత్తంలో వినియోగదారులకు అందించాయి. కాకపోతే కొన్ని సంస్థలు జీఎస్‌టీ తగ్గింపునకు అనుగుణంగా ధరలు తగ్గించకపోవడంపై వినియోగదారుల వ్యవహారాల శాఖకు 3,169 ఫిర్యాదులు కూడా వచ్చాయి. మొత్తం 94 ఫిర్యాదులను ఆ శాఖ పరిష్కరించింది. వినియోగదారుల ఫిర్యాదులను మరింత వేగంగా పరిష్కరించేందుకు గ్రీవెన్స్ రిపోర్టింగ్ పోర్టల్‌లో కొత్త ఫీచర్‌ను తీసుకురానున్నామని, దీని ద్వారా ఫిర్యాదులు ఆయా ప్రాంతాల చీఫ్ కమిషనర్లకు నేరుగా చేరతాయని నిర్మలా సీతారామన్ తెలిపారు. జీఎస్‌టీ సంస్కరణల ఫలితంగా ఈ ఏడాది అదనంగా రూ.20 లక్షల కోట్ల ఎలక్ట్రానిక్స్ వినియోగం జరగనుందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. అమెరికాకు స్మార్ట్ ఫోన్ల ఎగుమతుల్లో భారత్ పొరుగు దేశాలను అధిగమించింది. ఇది దేశానికి పెద్ద విజయం. రిటెయిల్ చైన్ డేటా ప్రకారం, దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం నవరాత్రి సమయంలో అమ్మకాలు గత సంవత్సరం కంటే 20-25 శాతం పెరిగాయి. ఉదాహరణకు 85 అంగుళాల టీవీల విభాగంలో స్టాక్ మొత్తం అమ్ముడైంది. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులపై డిమాండ్ పెరగడం.. తయారీ రంగంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతోంది. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ రెండంకెల వార్షిక సమ్మిళిత వృద్ధి రేటు (సీఏజీఆర్)కు పెరిగింది. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం ప్రత్యక్షంగా 25 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. పెద్ద కంపెనీల ఉత్పత్తులు 20 శాతం వరకు భారత్‌లోనే తయారవుతున్నాయి.

# ఈపీఎఫ్ వెనక్కి తీసుకుంటున్నారా?

ఉద్యోగ భవిష్య నిధి (ఈపీఎఫ్)... కొన్ని దశాబ్దాలు ఉద్యోగం చేశాక.. విశ్రాంత జీవితంలో ఆర్థికంగా ఇబ్బందులు రాకుండా అవసరమైన మొత్తాన్ని కూడబెట్టుకునేందుకు ఓ సురక్షిత మార్గం. ఒకప్పుడు ఇందులో నుంచి డబ్బు వెనక్కి తీసుకోవడం ఎంతో కష్టంగా ఉండేది. కాలానుగుణంగా మారిన నిబంధనలతో ఇప్పుడు ఈ నిధిని తీసుకోవడం సులభంగా మారింది. నిబంధనలు సరళీకరించారని, క్లెయిమ్‌ల సంఖ్యను పెంచారన్న కారణంతో భవిష్యనిధి నుంచి నిధులు ఉపసంహరించడం మంచిది కాదు. చిన్నమొత్తమే కదా... అంటూ ఇష్టానుసారం తీసుకుంటే ఆ ఖాతాలో ఏమీ మిగలదు. పదవీ విరమణ ప్రయోజనాలు పెద్దగా చేతికి అందవు. వృద్ధాప్యంలో చేతిలో నగదు నిల్వలు లేక ఆర్థికంగా ఒత్తిడి ఎదుర్కోవాల్సి వస్తుంది. చందాదారుడి భవిష్యనిధి ఖాతాలో కనీస నిల్వ 25 శాతం పోను మిగతా నిల్వను వెనక్కి తీసుకునేందుకు అనుమతిస్తూ ఈపీఎఫ్‌వో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేకుండా రూ.5 లక్షల విలువ కలిగిన క్లెయిమ్‌లను నేరుగా పరిష్కరించనుంది. అత్యవసర సందర్భాల్లో ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఈ ఖాతా నుంచి నగదు ఉపసంహరణకు ఈపీఎఫ్‌వో అనుమతిస్తోంది.




## కొనసాగిస్తేనే మేలు

నిబంధనల ప్రకారం ప్రతి నెలా మూల వేతనం, డీఏ కలిపిన మొత్తం నుంచి 12 శాతం ఉద్యోగి వాటాగా వేతనం నుంచి మినహాయించి, ఈపీఎఫ్ ఖాతాలో యాజమాన్యం జమ చేస్తుంది. అంతే మొత్తంలో తన వాటాగా యాజమాన్యమూ చెల్లిస్తుంది. యజమాని వాటా 12శాతంలో... 8.33 శాతం ఈపీఎస్ చందా (భవిష్యత్తులో పింఛను చెల్లింపు కోసం), మిగతా 3.67శాతం వాటాను ఉద్యోగి ఈపీఎఫ్ ఖాతాలోనే జమ చేస్తుంది. అయితే ఉద్యోగులు ఆర్థిక క్రమశిక్షణ, మెరుగైన వడ్డీ ఆదాయం కోసం అదనంగా స్వచ్ఛంద జమ (వీపీఎఫ్) చేసుకోవచ్చు. ఇలా చేసిన జమతో భవిష్యనిధి ఆదాయం పెరగడంతో పాటు ఆ మొత్తంపై వచ్చే వడ్డీ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఈపీఎఫ్‌పై 8.25 శాతం వడ్డీ లభిస్తోంది. ఏటా వడ్డీ అసలులో కలుస్తుంది. దీంతో చక్రవడ్డీ తరహాలో ఆదాయం వస్తుంది. ఇలా వచ్చిన మొత్తంపై ఆదాయ పన్ను ఇబ్బందులూ ఉండవు. ఇవన్నీ కలిపితే సుమారు 9.5-10 శాతం వరకు రాబడి వస్తున్నట్లు అనుకోవచ్చు.

## చేస్తున్న తప్పులు ఇవీ...

- కొందరు స్వల్పకాలం పాటు పనిచేసి మధ్యలో ఉద్యోగం మానేస్తున్నారు. రెండు నెలలు ఖాళీగా ఉంటే.. చాలు పీఎఫ్ ఖాతాలో అప్పటికే జమ అయిన మొత్తాన్ని వెనక్కి తీసుకుంటున్నారు. ఆర్థిక అవసరాల కోసం అలా చేశారనుకుందాం. కానీ పింఛను నిధి (ఈపీఎస్) మొత్తాన్ని వెనక్కి తీసుకుంటున్నారు. దీంతో చందాదారుడి ఖాతాలో నగదు లేకపోవడమే కాదు.. అప్పటి వరకు చేసిన సర్వీసు కాలం తిరిగి సున్నాకు చేరుతుంది. అందుకే ఎట్టిపరిస్థితుల్లోనూ ఈపీఎస్ మొత్తాన్ని ఉపసంహరించకూడదు.
- ఈపీఎస్ మొత్తాన్ని ఉపసంహరించకుండా తర్వాత చేరిన సంస్థలోని సర్వీసుకు కలపాలి. దీనివల్ల సర్వీసు కాలం పెరుగుతుంది. దీని ఆధారంగానే పదవీ విరమణ సమయంలో పింఛను ఈపీఎఫ్‌వో లెక్కిస్తుంది. ఈ కాలం ఎక్కువగా ఉంటే.. చేతికి వచ్చే పింఛను పెరుగుతుంది. ఈపీఎస్ సర్వీసులో జమయ్యే నిధి తక్కువగా ఉంటుంది. ఈ తక్కువ మొత్తాన్ని తీసుకుంటే.. చివరికి ఉద్యోగికి పెద్ద నష్టం జరుగుతుంది.
- ఏదైనా కంపెనీలో ఉద్యోగం మానేసి కొత్త సంస్థలో చేరిన తర్వాత ఈపీఎస్ సర్వీసుతో కూడిన ఖాతాను కొత్త కంపెనీకి అందించాలి. తద్వారా సర్వీసును కొత్త కంపెనీకి అనుసంధానం చేయడంతో ఈపీఎఫ్ నిల్వలన్నీ ఒకే ఖాతా కిందకు వస్తాయి. ఈపీఎస్ సర్వీసు కాలం నిరంతరాయంగా కొనసాగుతుంది.
- పదవీ విరమణ చేయగానే ఆర్థిక అవసరాలు ఉంటే తప్ప.. పీఎఫ్ ఖాతా నుంచి నగదు ఉపసంహరిం చుకోవద్దు. ఆ మొత్తాన్ని 61 ఏళ్ల వరకు పీఎఫ్ ఖాతాలో అలాగే పెట్టడం ద్వారా మెరుగైన వడ్డీ లభిస్తుంది. పైగా ఈ వడ్డీ ఆదాయంపై ఆదాయపన్ను ఉండదు.
- ఈపీఎఫ్ ఉపసంహరణల సంఖ్య పెరిగింది. గతంలో వివాహం, ఇంటి నిర్మాణం కోసం ఈపీఎఫ్ కింద కనీసం 5-7 ఏళ్ల సర్వీసు పూర్తిచేసినవారికే అవకాశం ఉంది. కొత్త నిబంధనల కింద ఏడాది అనంతరం ఈ కేటగిరీల్లో నగదు తీసుకోవచ్చు. స్వల్పకాలిక అవసరాలు, ఇతరత్రా కారణాలతో నగదు ఉపసంహరించుకుంటూ వెళ్తే క్లెయిమ్‌ల సంఖ్య పూర్తవుతుంది. కీలకమైన సమయంలో ఖాతాలో నగదు ఉండదు. ఒకవేళ ఉన్నా ఉపసంహరణల సంఖ్య పూర్తి కావడంతో నగదు తీసుకోవడం సాధ్యం కాదు.

> ఒక వ్యక్తి 25 ఏళ్ల సమయంలో ఉద్యోగంలో చేరారనుకుందాం. అతని మూల వేతనం, డీఏ కలిపి నెలకు రూ.15,000 ఉంటుంది. ఏటా వేతన పెరుగుదల 5శాతంగా ఉంది. ఆ ఉద్యోగి ఎన్నడూ పీఎఫ్ నిధులు తీసుకోలేదు. ఈపీఎఫ్‌వో చెల్లించే వడ్డీతో కలిపి అతను పదవీ విరమణ వయసు నాటికి (58 ఏళ్లకు) అతని ఖాతాలో రూ.కోటికిపైగా నిధులు ఉంటాయి. అలాగే నెలకు (ప్రస్తుత నిబంధనల ప్రకారం) రూ.7వేల వరకూ పింఛను అందుతుంది. పైగా ఈపీఎఫ్ నిల్వలపై వచ్చే వడ్డీ ఆదాయం, కార్పస్‌నిధి ఆదాయ పన్ను పరిధిలోకి రాదు. ఉద్యోగుల పింఛను నిధి సర్వీసులో ఎలాంటి అంతరాయం ఉండకుంటే రిటైర్మెంట్ తరువాత మెరుగైన ఈపీఎఫ్ పింఛను చేతికివచ్చే అవకాశాలు ఉంటాయి. ఉద్యోగంలో చేరినప్పటి నుంచీ ఈపీఎఫ్ సర్వీసులో అంతరాయం లేకుండా, నగదు ఉపసంహరణ చేయకుండా ఉంటే.. పదవీ విరమణ సమయంలో మెరుగైన నగదు నిల్వను వెనక్కి తీసుకోవచ్చు. అందులో కొంత పోస్టాఫీసు పెద్దల పొదుపు పథకం లేదా, యాన్యుటీ పథకాల్లో జమ చేసుకోవచ్చు. ఆ మొత్తంపై వచ్చే రాబడితో శేషజీవితం ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా గడపవచ్చు.

## గుజరాత్‌పై తెలుగు టైటాన్స్ గెలుపు



**న్యూఢిల్లీ:** ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఆఖరి దశ పోటీల్లో తెలుగు టైటాన్స్ నిలకడగా రాణిస్తోంది. ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో టైటాన్స్ జట్టు 30-25 గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించింది. టైటాన్స్ జట్టులో కెప్టెన్ విజయ్ మాలిక్ (8), భరత్ (7) పోటీపడి రాణించారు. ఇద్దరు ఆల్‌రౌండర్లు క్రమం తప్పకుండా పాయింట్లు తెచ్చిపెట్టారు. డిఫెండర్లు అజిత్ పవార్ (4), అంకిత్ (4)లు మెరుగ్గా ఆడారు. గుజరాత్ తరఫున రెయిడింగ్‌లో హిమాన్షు సింగ్ (6), కెప్టెన్ రాకేశ్ (5) రాణించగా, డిఫెండర్ లక్కీ శర్మ 4 పాయింట్లు సాధించాడు. మిగతా వారిలో ఆల్‌రౌండర్ మొహమ్మద్ రెజా (3), విశ్వనాథ్, నితిన్ పన్వార్ చెరో 2 పాయింట్లు చేశారు. 12వ సీజన్‌లో ఆరంభం నుంచే పట్టుదలగా ఆడుతున్న తెలుగు టైటాన్స్ 17 మ్యాచ్‌లాడి పదో విజయాన్ని నమోదు చేసింది. నేడు మ్యాచ్‌లకు విశ్రాంతి రోజు. రేపు జరిగే పోటీల్లో బెంగాల్ వారియర్స్‌తో తమిళ్ తలైవాస్ పోటీపడుతుంది. యూ ముంబాను జైపూర్ పింక్‌పాంథర్స్ ఢీకొంటుంది. హరియాణా స్టీలర్స్‌తో గుజరాత్ జెయంట్స్ తలపడుతుంది. **ప్లేఆఫ్స్ చేరిన యూ ముంబా...** లీగ్‌లో మరో జట్టు యూ ముంబా కూడా ప్లే ఆఫ్స్ చేరింది. హరియాణా స్టీలర్స్‌తో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో యూ ముంబా టై బ్రేకర్‌లో గెలిచి ముందంజ వేసింది. నిర్ణీత సమయం ముగిసే సరికి ఇరు జట్లు 37-37 స్కోరుతో సమంగా నిలిచాయి. దీంతో టైబ్రేక్ అనివార్యం కాగా యూ ముంబా రెయిడర్లు జట్టును గెలిపించారు. సందీప్ (9) అదరగొట్టాడు. 21 సార్లు కూతకెళ్లిన అతను 9 సార్లు విజయవంతంగా పాయింట్లు తెచ్చాడు. సహచరుల్లో అజిత్ చౌహాన్ (6), అమిర్ మొహమ్మద్ (6), సునీల్ కుమార్ (4), విజయ్ కుమార్ (3) రాణించారు. హరియాణా జట్టులో జైదీప్ (9) కడదాకా శ్రమించాడు. మిగతావారిలో సాహిల్ నర్వాల్ (6), శివమ్ పతారే (4), వినయ్ (3), రాహుల్ (3) మెరుగ్గా ఆడారు. ఆఖరి మూడో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 38%-%27తో పుణేరి పల్టన్‌పై గెలుపొందింది.

## ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తన్వీ శర్మకు రజతం



భారత యువ షట్లర్ తన్వీ శర్మ ప్రపంచ జూనియర్ బ్యాడ్మి ంటన్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం కైవసం చేసుకుంది. గువాహటిలో జరిగిన టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్లో తన్వీ పరాజయం పాలైంది. ఆది వారం జరిగిన తుదిపోరులో టాప్ సీడ్ తన్వీ శర్మ 7-15, 12-15తో రెండో సీడ్ అన్యా పత్ ఫిచిత్‌ఫోన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడింది. ఈ మెగా ఈవెంట్ చరిత్రలో మహిళల సింగిల్స్‌లో భారత్ నుంచి అపర్ణ పోపట్ (1996లో రజతం), సైనా నెహ్వాల్ (2006లో రజతం, 2008లో స్వర్ణం) మాత్రమే పతకాలు గెలిచారు. మళ్లీ ఇప్పుడు 17 ఏళ్ల తర్వాత తన్వీ శర్మ ఆ జాబితాలో చోటు దక్కించుకుంది. మ్యాచ్ ఆరంభం నుంచే తన్వీ లయ కోల్పోయింది. 'చాలా తప్పులు చేశా. మ్యాచ్ ప్రారంభం నుంచే తడబడ్డా. తొలి గేమ్ తర్వాత తేరుకొని... రెండో గేమ్‌లో గట్టి పోటీ ఇచ్చేందుకు ప్రయత్నించా. 8-5తో ఆధిక్యంలో ఉన్న సమయంలో చేసిన తప్పిదంతో థాయ్ షట్లర్‌కు పట్టుబిగించే అవకాశం దక్కింది. ప్రత్యర్థి నా ఆటతీరును సులువుగా పట్టేసింది' అని తన్వీ పేర్కొంది.


# తేలిపోయిన బ్యాటర్లు

## నిరాశపరిచిన కోహ్లి, రోహిత్

### తొలి వన్డేలో భారత్‌పై ఆస్ట్రేలియా ఘనవిజయం



పెర్త్ : ఆస్ట్రేలియా పర్యటనను టీమ్‌ఇండియా పేలవంగా ఆరంభించింది. బౌన్సీ పిచ్‌పై బ్యాటర్లు విఫలమవడంతో.. ఆదివారం తొలి వన్డేలో 7 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. వర్షం వల్ల 26 ఓవర్లకు కుదించిన పోరులో మొదట భారత్ 9 వికెట్లకు 136 పరుగులే చేయగలిగింది. రాహుల్ (38, 31 బంతుల్లో 2x4, 2x6) టాప్ స్కోరర్. అక్షర్ పటేల్ (31, 38 బంతుల్లో 3x4) కూడా రాణించాడు. రోహిత్ శర్మ (8), కోహ్లి (0) విఫలమయ్యారు. వీరి ఆట 22 బంతులకు పరిమితమైంది. హేజిల్‌వుడ్ (2/20), ఒవెన్ (2/20), కునెమన్ (2/26), స్టార్క్ (1/22) టీమ్‌ఇండియాను దెబ్బతీశారు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో కంగారూల లక్ష్యాన్ని 131 పరుగులకు సవరించారు. కెప్టెన్ మిచెల్ మార్ష్ (46 నాటౌట్, 52 బంతుల్లో 2x4, 3x6), జోష్ ఫిలిప్ (37, 29 బంతుల్లో 3x4, 2x6) చెలరేగడంతో లక్ష్యాన్ని ఆసీస్.. 21.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ మ్యాచ్‌తో నితీశ్ వన్డే అరంగేట్రం చేశాడు. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0 ఆధిక్యం సంపాదించింది. రెండో వన్డే గురువారం జరుగుతుంది.



**తడబడ్డారిలా..:**

కొన్నిసార్లు మెరుగైన ప్రదర్శన చేసినా, విజయాలు సాధించినా.. బౌన్సీ పిచ్‌లపై ఆడడంలో బలహీనత టీమ్‌ఇండియాను ఇంకా విడిచి పోలేదు. పెర్త్‌లో బ్యాటుతో మన జట్టు తడబడింది. మబ్బుపట్టిన వాతావరణంలో ఆస్ట్రేలియా టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా.. భారత బ్యాటర్లు చెమటోడ్చారు. బౌన్సీ పిచ్‌పై కంగారూ పేసర్లను ఎదుర్కొనేందుకు కష్టపడ్డారు. పదే పదే వర్షం రావడం కూడా భారత్ లయను దెబ్బతీసింది. రాహుల్ నిలవకుంటే పరిస్థితి ఇంకా ఇబ్బందికరంగా ఉండేదే. అదనపు బౌన్స్‌ను సద్వినియోగం చేసుకున్న ఆసీస్ కొత్త బంతి బౌలర్లు హేజిల్‌వుడ్, స్టార్క్‌లు.. భారత స్టార్లు రోహిత్ (14 బంతుల్లో 8), కోహ్లి (8 బంతుల్లో 0)ను వెనక్కి పంపారు. ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య గిల్ (10)తో కలిసి ఇన్నింగ్స్‌ను ఆరంభించిన రోహిత్.. స్టార్క్ బౌలింగ్‌లో స్ట్రెయిట్ డ్రైవ్‌తో బౌండరీ సాధించాడు. కానీ అతడు ఎంతోసేపు నిలవలేదు. హేజిల్‌వుడ్ బంతి.. అతడి బ్యాటును ముద్దాడుతూ వెళ్లి రెండో స్లిప్‌లో రెన్‌షా చేతుల్లో పడింది. కోహ్లిది పాత సమస్యే. ఆఫ్‌స్టంప్ ఆవల స్టార్క్ బంతిని ఆడిన అతడు.. కనోలీ అందుకున్న చక్కని క్యాచ్‌కు నిష్క్రమించాడు. ఆస్ట్రేలియాలో కోహ్లికి ఇది తొలి వన్డే డక్. సాధికారికంగానే కనిపించిన గిల్.. ఎలిస్ బంతిని ఫ్లిక్ చేయబోయి వికెట్‌కీపర్ ఫిలిప్‌కు దొరికిపోవడంతో భారత్.. 9వ ఓవర్లో 25/3తో కష్టాల్లో పడింది. వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (11) కూడా నిలబడలేదు. పక్కటెముకల మీదికి హేజిల్‌వుడ్ వేసిన బౌన్సర్ అతడి గ్లోవ్స్‌ను తాకుతూ వెళ్లి ఫిలిప్ చేతికి చిక్కింది. 16 ఓవర్లకు స్కోరు 50/4. అప్పటికే ఇన్నింగ్స్‌ను కుదించారు. మళ్లీ వర్షం రావడంతో చివరగా ఇన్నింగ్స్‌ను 26 ఓవర్లకు తగ్గించారు. దీంతో రాహుల్, అక్షర్‌లకు ధాటిగా ఆడడం తప్ప మరో మార్గం లేకపోయింది. ఇద్దరూ చకచకా కొన్ని బౌండరీలు కొట్టడంతో అభిమానులకు ఉత్సాహం వచ్చింది. 39 పరుగులు జోడించాక అక్షర్ ఔటైనా.. దూకుడు కొనసాగించిన రాహుల్.. సుందర్ (10)తో కలిసి మరో భాగస్వామ్యాన్ని (31) నెలకొల్పాడు. షార్ట్ బౌలింగ్‌లో రాహుల్ వరుసగా రెండు సిక్స్‌లు కొట్టాడు. అయితే ఆఖర్లో సుందర్, రాహుల్, రాణా, అర్ష్‌దీప్ చకచకా వెనుదిరిగారు. ఆఖరి ఓవర్లో నితీశ్ కుమార్ రెడ్డి (19 నాటౌట్‌బీ 11 బంతుల్లో 2x6) రెండు సిక్స్‌లు బాదడంతో టీమ్‌ఇండియా స్కోరు 130 దాటింది. హేజిల్‌వుడ్ ఏడు ఓవర్ల స్పెల్‌లో 35 డాట్ బాల్స్ వేయడం విశేషం.

**కెప్టెన్ ముందుండి..:**

ఛేదనలో కెప్టెన్ మిచెల్ మార్ష్ ఆస్ట్రేలియాను విజయపథంలో నడిపించాడు. స్వల్ప ఛేదనలో ఓపెనర్లు మార్ష్, హెడ్ చెలరేగిపోతారని అనుకున్నారంతా. కానీ సీమ్‌కు అనుకూలిస్తున్న పరిస్థితుల్లో బ్యాటింగ్ అంత తేలిక కాలేదు. ప్రమాదకర ఓపెనర్ హెడ్ (8)ను అర్ష్‌దీప్ రెండో ఓవర్లోనే ఔట్ చేయగా.. ఎనిమిదో ఓవర్లో షార్ట్ (8)ను అక్షర్ వెనక్కి పంపాడు. ఆసీస్ 44/2తో నిలిచింది. కానీ భారత బౌలర్లు.. ఆసీస్ బౌలర్లంత గొప్పగా బౌలింగ్ చేయలేకపోయారు. మార్ష్ చక్కని బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఫిలిప్‌తో మూడో వికెట్‌కు 55, రెన్‌షా (21 నాటౌట్)తో అభేద్యమైన మూడో వికెట్‌కు 32 పరుగులు జోడించి లక్ష్యాన్ని పూర్తి చేశాడు. రెన్‌షా టెస్టు అరంగేట్రం చేసిన తొమ్మిదేళ్లకు వన్డే అరంగేట్రం చేయడం విశేషం.



**వానే వాన:**

తొలి వన్డే సందర్భంగా వర్షం అభిమానులను తీవ్ర అసహనానికి గురిచేసింది. దీంతో భారత ఇన్నింగ్స్‌ను కుదిస్తూ పోయారు. 9వ ఓవర్లో భారత్ 25/3తో ఉన్నప్పుడు మొదటిసారి వర్షం వచ్చింది. మళ్లీ మళ్లీ ఆట ఆగడంతో ఇన్నింగ్స్‌ను కుదించే అవకాశం ఉందని గ్రహించిన ఆసీస్.. తన ప్రధాన పేసర్లు హేజిల్‌వుడ్, స్టార్క్‌లను ఎక్కువగా ఉపయోగించుకుంది. మొత్తం ఆరుసార్లు వరుణుడు భారత్ ఇన్నింగ్స్‌కు బ్రేకులు వేశాడు.

# ఆఖర్లో కూలార్చారు

## ఇంగ్లాండ్ చేతిలో భారత్ ఓటమి

## 4 పరుగులతో భారత మహిళల ఓటమి

### స్మృతి, హర్మన్, దీప్తి శ్రమ వృథా

### శతక్కొట్టిన హీథర్‌నైట్

**ఇండోర్ :** సొంతగడ్డపై ఫేవరెట్లలో ఒకటిగా బరిలో దిగిన భారత్‌కు మహిళల వన్డే ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ ఓటమి. ఆదివారం హర్మన్‌ప్రీత్‌సేన 4 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ చేతిలో పరాజయం పాలైంది. మొదట ఇంగ్లాండ్ 8 వికెట్లకు 288 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హెదర్ నైట్ (109, 91 బంతుల్లో 15x4, 1x6) సెంచరీతో మెరిసింది. అమీ జోన్స్ (56), నాట్ సీవర్ (38) కూడా రాణించారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ (4/51) ఆకట్టుకుంది. శ్రీ చరణి 2 వికెట్లు తీసింది. ఛేదనలో భారత్ 6 వికెట్లకు 284 పరుగులే చేయగలిగింది. స్మృతి మంధాన (88, 94 బంతుల్లో 8x4), హర్మన్‌ప్రీత్ కౌర్ (70, 70 బంతుల్లో 10x4), దీప్తి శర్మ (50, 57 బంతుల్లో 5x4) శ్రమ వృథా అయింది. నాట్ సీవర్ (2/47), లిన్సీ స్మిత్ (1/40) ఇంగ్లాండ్ విజయంలో కీలకపాత్ర పోషించారు.

**స్మృతి, హర్మన్ నిలిచినా..:**

ఒకవైపు సవాల్ విసిరే లక్ష్యం.. మరోవైపు 13 పరుగులకే తొలి వికెట్.. ఇలా మొదలైంది భారత్ ఇన్నింగ్స్. ఇంగ్లిష్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో స్మృతి మంధాన కూడా వేగంగా ఆడలేకపోయింది. హర్లీన్ డియోల్ (24, 31 బంతుల్లో 5x4) కొన్ని బౌండరీలు కొట్టడంతో భారత్ స్కోరింగ్ రేటు మరీ పడిపోలేదు. హర్లీన్ వెనుదిరిగినా.. స్మృతి, హర్మన్ నిలిచారు. ఒత్తిడిని తట్టుకుంటూ.. స్కోరు పెంచారు. డీన్ వేసిన 24వ ఓవర్ తొలి బంతికే హర్మన్‌ప్రీత్ వెనుదిరగాల్సింది. అంపైర్ కూడా ఆమెను ఎల్బీగా ప్రకటించింది. కానీ సమీక్షలో నాటౌట్‌గా తేలింది. అప్పటికి ఆమె స్కోరు 39. తర్వాత 60 బంతుల్లో స్మృతి.. 54 బంతుల్లో హర్మన్ అర్ధసెంచరీలు అందుకున్నారు. 30 ఓవర్లకు 167/2తో భారత్ పటిష్టస్థితిలో నిలిచింది. అయితే హర్మన్‌ను నాట్ సీవర్ ఔట్ చేసి ఇంగ్లాండ్‌కు బ్రేక్ ఇచ్చింది. స్మృతి-హర్మన్ జంట మూడో వికెట్‌కు 125 పరుగులు జత చేసింది. వికెట్ పడినా.. భారత్ ఒత్తిడికి గురి కాలేదు. దీప్తి శర్మతో కలిసి స్మృతి ఇన్నింగ్స్‌ను నడిపించింది. సెంచరీ దిశగా సాగుతున్న స్మృతిని లిన్సీ స్మిత్ ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పింది. తర్వాత రిచా ఘోష్ (8)తో పాటు కుదురుకున్న దీప్తి వెనుదిరగడంతో భారత్ ఒత్తిడిలో పడిపోయింది. అమన్‌జ్యోత్ (18 నాటౌట్), స్నేహ్ రాణా (10 నాటౌట్) వేగంగా ఆడలేకపోయారు. చివరి ఓవర్లో గెలవాలంటే 14 పరుగులు అవసరమయ్యాయి. కానీ 5 బంతుల్లో 5 పరుగులే రావడంతో భారత్‌కు దారులు మూసుకుపోయాయి. చివరి బంతికి అమన్‌జ్యోత్ ఫోర్ కొట్టింది.



అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



## పోలీస్ ఆఫీసర్‌గా సన్నీ లియోన్..

సన్నీ లియోన్ ఇప్పుడు పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా అలరించేందుకు సిద్ధం అవుతున్నది. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'త్రిముఖ'. రాజేష్ నాయుడు దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీని అఖిరా డ్రీమ్ క్రియేషన్స్ బ్యానర్‌పై డాక్టర్ శ్రీదేవి మద్దాలి, రమేష్ మద్దాలి నిర్మిస్తున్నారు. హై బడ్జెట్‌తో ఏకంగా పాన్ ఇండియా లెవల్‌లో హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో సన్నీ లియోన్ పోలీస్ ఆఫీసర్‌గా నటించడం అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీ డిసెంబర్‌లో వచ్చేందుకు సిద్ధం అవుతుండగా.. తాజాగా టీజర్ రిలీజ్ చేశారు మేకర్స్. 'ఓటమి ఎరుగని శివంగి.. కానీ ఎదురుగా యుద్ధం.. తానెప్పుడూ సిద్ధం.. ఇప్పుడు ఎదురైంది ఛేదించలేని పద్మవ్యూహం.. తన చుట్టూ అలుముకుంది సందిగ్ధం.. కనుసైగతో సమస్యను గ్రహించే విషయపరిజ్ఞాని.. సమస్తమూ చదివిన జ్ఞాని.. అహంకారాన్ని అదుపు చేసుకోలేని అజ్ఞాని' అంటూ స్టార్ట్ అయిన ఈ టీజర్‌పై సన్నీ లియోన్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ శివంగిలా కనిపించి ఆడియన్స్‌ను ఆశ్చర్యపరిచింది. ప్రజెంట్ ఈ టీజర్ వైరల్ అవుతుండగా.. సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ దక్కించుకుంటుంది.

## ఇంటెన్స్ యాక్షన్ డ్రామాలో

# సంయుక్త..

వెంకటేష్ నటించిన 'చింతకాయల రవి' ఫేమ్ డైరెక్టర్ యోగి.. ఇప్పుడు చాలా గ్యాప్ తర్వాత లేడీ ఓరియెంటెడ్ మూవీని తీయబోతున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే.. ఇప్పుడు ఈ ప్రాజెక్ట్‌పై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చింది. హాస్యమూవీస్ అండ్ మాగంటిపిక్చర్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెంబర్-6గా రాబోతున్న ఈ మూవీకి 'ది బ్లాక్ గోల్డ్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఇందులో హీరోయిన్‌గా సంయుక్త నటిస్తుండగా.. దీపావళి స్పెషల్‌గా ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రాబోతున్నట్లు ప్రకటించారు. ఇంతకు ముందు ఎన్నడూ చూడని విధంగా ఒక ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో సంయుక్త క్యారెక్టర్ చాలా పవర్ ఫుల్‌గా ఉండనున్నట్లు తెలుస్తుండగా.. ఫస్ట్ లుక్ కోసం వెయిటింగ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు. కాగా.. ప్రజెంట్ సంయుక్త చేతిలో అఖండ 2, స్వయం భూ, నారీ నారీ నడుమ మురారి చిత్రాలతో పాటు.. పూరిసేతుపతి ప్రాజెక్టు కూడా ఉండగా.. ఇప్పుడు లేడీ ఓరియెంటెడ్ మూవీకి సిద్ధం కావడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు.





## అతడి కోసం

# ఎంత కష్టమైనా తట్టుకుంటా

### శివానీ ఆసక్తికర కామెంట్స్

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ శివానీ నగరం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ అమ్మడు 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' సినిమాతో ఇండస్ట్రీకి పరిచయం అయింది. మొదటి మూవీతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకుని క్రేజీ హీరోయిన్‌గా మారిపోయింది. ఇక ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించి మెప్పించింది. ఇక ఇటీవల ఆమె 'లిటిల్ హార్ట్స్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ చిత్రం బాక్సాఫీసు వద్ద భారీ హిట్‌గా నిలిచింది. అంతేకాకుండా కలెక్షన్లు కూడా బాగానే రాబట్టడంతో పాటు.. సినీ సెలబ్రిటీలు ప్రశంసలు పొందింది. 'లిటిల్ హార్ట్స్' చిన్న సినిమాగా వచ్చి పెద్ద విజయాన్ని ఇచ్చింది. దీంతో శివానీ నగరం క్రేజ్ ఊహించని రేంజ్‌లోకి వెళ్లింది. ఈ క్రమంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలలో పాల్గొన్న శివానీ ఆసక్తికర కామెంట్స్ చేసింది. "నాకు మహేష్ బాబు అంటే పిచ్చి ఇష్టం. ఆయనను చిన్నప్పటి నుంచి చూస్తున్నాను. చాలా అందంగా ఉంటారు. సూపర్ స్టార్ నాకు చిన్నప్పటి నుంచి ఫేవరెట్ హీరో. ఒక్కసారి అయినా ఆయనను కలవాలని అనుకునేదాన్ని. ఇప్పుడు సినిమాల్లోకి వచ్చాక అవకాశం వస్తే ఆయన మూవీలో ఎలాంటి పాత్ర అయినా చేయాలనుకుంటున్నాను. మహేష్ బాబుతో నటించేందుకు ఎదురుచూస్తున్నాను. ఒకవేళ అవకాశం వస్తే ఎంత బిజీగా ఉన్నా సరే ఒప్పుకుంటాను. ఆయన కోసం ఏదైనా చేస్తా.. ఎంత కష్టం అయినా మహేష్ బాబు కోసం తట్టుకుంటాను" అని చెప్పుకొచ్చింది.

## ఎన్ని కోట్లు ఆఫర్ చేసినా..

# అలాంటి రోల్‌లో మళ్లీ నటించను

### విశాల్



తన కెరీర్‌లో సవాలు విసిరిన పాత్ర 'అవన్- ఇవన్' (తెలుగు టైటిల్ వాడు-వీడు) అని, ఎన్ని రూ.కోట్లు ఆఫర్ చేసినా అలాంటి పాత్రలో మళ్లీ నటించే ప్రసక్తే లేదని విశాల్ అన్నారు. ఆ రోల్ కోసం శారీరకంగా, మానసికంగా ఎంతో శ్రమపడ్డానని తెలిపారు. బాలా తెరకెక్కించిన ఈ సినిమాలో ఆర్య మరో హీరో. 2011లో విడుదలైంది. 'యువర్స్ ఫ్రాంక్లీ విశాల్' పాడ్‌కాస్ట్‌లో విశాల్ మాట్లాడారు. పలు సినిమా విశేషాలు పంచుకున్న ఆయన.. అవార్డులపై నమ్మకం లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. "జాతీయ పురస్కారాలు సహా నేను అవార్డులను నమ్మను. జ్యూరీగా ఉండే ఏడెనిమిది మంది బెస్ట్ యాక్టర్, బెస్ట్ మూవీని ఎలా డిసైడ్ చేస్తారు? ఓ సర్వే నిర్వహించి ప్రేక్షకుల అభిప్రాయాలు సేకరించాలి. అలా చేయడం ముఖ్యం. నాకు అవార్డు రాలేదనే ఉద్దేశంతో ఇదంతా చెప్పడం లేదు. ఒకవేళ నాకు ఏదైనా అవార్డు వచ్చినా దాన్ని డస్ట్‌బిన్‌లో వేస్తా. అది బంగారంతో తయారు చేయించిందైతే.. దాన్ని అమ్మేసి, వచ్చిన డబ్బును ఛారిటీకి విరాళం ఇస్తా" అని పేర్కొన్నారు. సినిమాల్లో ఎంత కష్టమైన స్టంట్స్ అయినా చేస్తానని, డూప్‌తో చేయించడం తనకు ఇష్టం ఉండదని తెలిపారు. యాక్షన్ చిత్రీకరించే క్రమంలో గాయాలు కాగా ఇప్పటి వరకూ తనకు 119 కుట్లు పడ్డాయని తెలిపారు. ఈ పాడ్‌కాస్ట్ ప్రోమో శనివారం ఉదయం యూట్యూబ్‌లో విడుదల కాగా.. ప్రస్తుతం ఫుల్ ఎపిసోడ్ స్ట్రీమింగ్ అవుతోంది. 'మకుటం', 'తుప్పరివాలన్ 2' చిత్రాలతో బిజీగా ఉన్న విశాల్.. సుందర్ సి. దర్శకత్వంలో త్వరలోనే ఓ సినిమా చేయనున్నారని సమాచారం.

# నేను ప్రెగ్నెంట్!

### హాట్ టాపిక్‌గా రెజీనా కామెంట్స్

టాలీవుడ్ హీరోయిన్ రెజీనా కాసండ్రా 'శివ మనసులో శృతి' సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయం అయింది. ఆ తర్వాత ఎన్నో చిత్రాల్లో నటించి మెప్పించిన ఆమె భాషతో సంబంధం లేకుండా వరుస ప్రాజెక్ట్స్ చేసింది. ఇక గత ఏడాది 'ఉత్సవం'తో ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం బ్లాక్ బస్టర్ హిట్ సీక్వెల్ 'అమ్మను-2' పనుల్లో ఫుల్ బిజీ బిజీగా గడుపుతోంది. ఈక్రమంలో.. తాజాగా, ఓ షోలో పాల్గొన్న రెజీనా తను ప్రెగ్నెంట్ అయినట్లు చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల శ్రీముఖి హోస్ట్ చేస్తున్న చెఫ్ మంత్ర షోలో పాల్గొని షాకింగ్ విషయాలు చెప్పింది. "ఫుడ్ అనేది నా కోసం ఓ అడ్వెంచర్‌లా ఉంటుంది. ఏం తినాలో, ఎంత తినాలో, ఎప్పుడు తినాలో నేను చాలా జాగ్రత్తగా చూసుకుంటాను. బెంగళూరులో ఉన్నప్పుడు ఒక రాత్రి తనకు చాలా ఇష్టమైన "మిష్టి దోయ్" తినాలని బాగా అనిపించిందట. దానికోసం ఎన్నో స్వీట్ షాపులు తిరిగిందట. కానీ, ఎక్కడా దొరకలేదని చెప్పింది. చివరికి ఒక షాప్‌లో ఆ స్వీట్ కనిపించినా అప్పటికే షాప్ మూసే టైమ్ అయిపోయింది. సేల్స్ బాయ్ 'ఇప్పుడే షాప్ క్లోజ్ అయిపోయింది, సర్వ్ చేయలేం' అన్నారు. దీంతో ఏం చేయాలో అర్థం కాక.. నేను ప్రెగ్నెంట్ ఈ స్వీట్ తినాలని చాలా కోరికగా ఉందని చెప్పా. వెంటనే జాలిపడిన షాక్ కీపర్ వెళ్లి తీసుకోండి అనడంతో డబ్బులు ఇచ్చేసి వెళ్లిపోయాను. ఆ తర్వాత నా ఫ్రెండ్స్ అంతా ఎందుకలా చెప్పావని షాక్ అయ్యారు. కానీ నాకు చాలా చాలా క్రేవింగ్స్ వచ్చాయి.. తినాలనిపించింది కంట్రోల్ చేసుకోలేకపోయాను. అందుకే మిష్టి దోయ్ స్వీట్ కోసం అలా చెప్పాల్సి వచ్చింది" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com